సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 28-3-2025 15/-


# వక్ఫ్ సవరణ బిల్లుపై భారీ నిరసన









# గీటురాయి
సమాజేవన భావాల పాఠ్యరాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 13 హైదరాబాద్
శుక్రవారం 28 మార్చి 2025 రూ.15-00
27 రమజాన్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

నిత్యావసర పదార్థాల్ని నిలువ చేయకుండా సమయానికి మార్కెట్‌లోకి తెచ్చి విక్రయించే వ్యక్తి దైవానుగ్రహానికి అర్హుడవుతాడు. అతనికి అల్లాహ్ పుష్కలంగా జీవికను ప్రసాదిస్తాడు.
**అయితే నిలువ చేసే వ్యక్తి అల్లాహ్ శాపానికి గురవుతాడు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




# ఔరంగజేబు చుట్టూ రాజకీయాలు

## లోపల...


గ్రోక్ వద్దు ...... 04
వక్ఫ్ సవరణ బిల్లుపై భారీ నిరసన ...... 05
వక్ఫ్ ఆస్తుల దురాక్రమణకే సవరణ బిల్లు ...... 08
ముస్లిం జనాభా అపోహలు ...... 12
కుటుంబ వ్యవస్థను కాపాడుకుందాం ...... 14
జీవితానికి దారి దీపం ...... 17
వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... 18
అడుగుజాడలు ...... 19
అమెరికా ఆర్థిక సంక్షోభం ఒక గుణపాఠం – 2 ...... 20
పండుగ (ఈద్) ...... 23
ఊపిరి తిత్తులూ... ...... 24
శుభాల ఖజానా రమజాన్ ...... 28
సంక్షిప్త భారతం ...... 32
సర్వత్రా ...... 33
సాత్వికతకు సోపానం ...... 34


## సిగ్గు సిగ్గు ...!



రోరోజు పెరుగుతోంది
దేశమ్‌లో అసహనం
క్రూరమైన నేతృత్వం
విలువలన్నీ పతనం!
మంచిలేదు చెడ్డలేదు
మానవత్వమసల్లేదు
మతోన్మాద మూకలకు
దేశంలో కొదవలేదు !!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## గ్రోక్‌వద్దు

**దేశంలో** చాలా కాలంగా, దశాబ్దాలుగా ఫేక్ వార్తలు వీర విహారం చేస్తున్నాయన్నది అందరికీ తెలిసిందే. ఈ ఫేక్ వార్తల బండారం బయటపెట్టే నిజనిర్ధారణలు కొన్ని జరిగాయి. కాని ఇప్పుడు ఈ నిజనిర్ధారణ జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా జరగడం ఒక విచిత్రం.

ఎలన్ మస్క్ ప్రవేశపెట్టిన కొత్త చాట్ బాట్ గ్రోక్ ఇటీవల ఆరెస్సెస్ గురించి, మోడీ గురించి, బీజేపీ గురించి చెప్పిన మాటలు చర్చనీయాంశాలయ్యాయి. ఇప్పటికైనా నిజాలు నిర్భయంగా చెప్పేవాడొకడు (ఒక చాట్ బాట్) వచ్చాడని కొందరు సంతోషించారు. నెహ్రూ గురించి, సోనియాగాంధీ గురించి ప్రచారంలో పెట్టిన మాటల్లోని నిజానిజాలను కూడా గ్రోక్ బట్టబయలు చేసింది.

గ్రోక్ కొంతకాలంగా ఉంది. కాని గత వారం రోజులుగా హంగామా చేస్తోంది. ఎందువల్ల ఇప్పుడే ఈ సంచలనం... ఆలోచించాలి.

గ్రోక్‌కు యజమాని ఎలన్ మస్క్. ఆయనగారి టెస్లా ఇండియా రావడాన్ని వ్యతిరేకిస్తున్నవారు, స్టార్ లింక్ ఇండియా రావడాన్ని వ్యతిరేకిస్తున్న వారు నిజానికి మోడీ వ్యతిరేకులు కూడాను. ఇప్పుడు ఎలన్ మస్క్ గారి గ్రోక్ మోడీకి, బీజేపీకి వ్యతిరేకంగా చేస్తున్న ఈ హంగామా వల్ల వీళ్ళే ఎక్కువ సంతోషిస్తున్నారు. వీళ్ళను సంతోషపెట్టడం ద్వారా తన పట్ల వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నాలు దీని వెనుక లేవు కదా... ఆలోచించాలి. ఎందుకంటే, స్టార్ లింక్ ఇండియాకు రావడం వల్ల ఇంటర్నెట్ కనెక్టివిటి పెరిగే కొన్ని ప్రయోజనాలున్నప్పటికీ దేశానికి అనేక నష్టాలు కూడా తప్పవు. ఈ నష్టాలు తెలుసు కాబట్టే మస్క్‌కు అనుమతి ఇవ్వడానికి మోడీ ప్రభుత్వం స్పెక్ట్రమ్ కేటాయింపు విధి విధానాలు మార్చేయడాన్ని చాలా మంది తప్పు పట్టారు. ఇప్పుడు గ్రోక్ ద్వారా ఎలన్ మస్క్ వీళ్ళందరినీ సంతోషపెడుతున్నాడు.

ఇక్కడ మరో నష్టం గురించి కూడా ఆలోచించుకోవాలి. అదేమిటంటే, ఈ చాట్ బాట్లు చేసే పని ఇంటర్నెట్‌లో గూగుల్ మొదలైన వేదికలపై ఉన్న సమాచారాన్ని తీసి ఇవ్వడం. అంటే, ఏదన్నా విషయం గురించి అడిగితే గ్రోక్ ఇచ్చిన సమాచారానికి ఆధారమైన వెబ్ సెట్ల గురించి కూడా రిఫరెన్సు ఇస్తుంది. అంటే ఆ పది వెబ్ సైట్లు చూసే అవసరం లేకుండా గ్రోక్ ఆ వెబ్ సైట్లలో సమాచారాన్ని చదివి మనకు కావలసింది అందిస్తుంది. దీనివల్ల జరిగేదేమిటి, ఆ వెబ్ సైట్లకు వెళ్ళే ట్రాఫిక్ తగ్గిపోతుంది. చాట్‌బాట్లపై ఆధారపడడం పెరిగితే వెబ్‌సైట్ల ఆదాయం పడిపోతుంది. ముఖ్యంగా న్యూస్ వెబ్‌సైట్లు ఆదాయం లేని స్థితిలో అంతరించే దశ వస్తుంది. గ్రోక్ వంటి చాట్ బాట్‌కు స్వంత రిపోర్టర్లు ఉండరు. కాని న్యూస్ పోర్టల్ నడపాలంటే స్వంత రిపోర్టర్లతో ప్రత్యక్షంగా వార్తలు సేకరించాలి. కేవలం గ్రోక్‌పై ఆధారపడడం వల్ల ఈ వార్తా జగత్తుకు వాటిల్లే నష్టం ఇది.

ఆలోచించవలసిన మరో విషయం, గ్రోక్ వంటి చాట్ బాట్లు పూర్తిగా నిష్పక్షపాతంగా ఉంటాయా? వాటిని మాన్యుపులేట్ చేయడం వాటిని సృష్టించిన వారికి సాధ్యం కాదా?

గ్రోక్ చెబుతున్న మాటలకు సంతోషిస్తున్న వాళ్ళు ఆలోచించుకోవలసిన విషయాలివి.

నిజాలను తెలుసుకోడానికి ప్రామాణిక ఆధారాలు పుస్తకాలు. వాటిని చదవడం వల్ల ప్రత్యక్షంగా వాస్తవాలేమిటో అర్థమవుతాయి. వాటిని ఏదో చాట్ బాట్ చదివి చెబితే పూర్తిగా నమ్మడంలో విజ్ఞత లేదు. ఎందుకంటే సైన్సు రెండువైపులా పదునున్న కత్తి. దాన్ని ఎలా వాడుకోవాలో అలాగే వాడుకోవాలి. లేకపోతే యాపిల్ కోసుకునే బదులు వేళ్ళు కోసుకునే పరిస్థితి రావచ్చు.

అబ్దుల్ వాహెద్




# వక్ఫ్ సవరణ బిల్లుపై భారీ నిరసన

## — దేశవ్యాప్త ఉద్యమానికి సన్నద్ధమవుతున్న ముస్లిం పర్సనల్ లా బోర్డు —

**ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు** ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన జరిగింది. వివిధ సముదాయాలకు, వర్గాలకు, తరగతులకు చెందిన వేలాది మంది ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు కూడా ఈ ప్రదర్శనలో కనిపించారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమానికి సన్నద్ధమవుతామని వక్తలు ప్రకటించారు.

ప్రభుత్వం బిల్లును పూర్తిగా ఉపసంహరించుకోవాలన్న డిమాండ్ బలంగా వినిపించారు.

కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఆప్, మజ్లిస్, వామపక్షాలు, ముస్లిం లీగ్, ఎన్సీపీ, టీఎంసీ, బీజేడీ, వెల్ఫేర్ పార్టీలతో సహా ప్రతిపక్షాలకు చెందిన అనేక మంది నాయకులు ఈ ప్రదర్శనలో పాల్గొని వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించారు. అయితే పర్సనల్ లా బోర్డు ఈ నిరసన ప్రదర్శనలో జనతాదళ్ యునైటెడ్ పార్టీని, తెలుగు దేశాన్ని ఆహ్వానించలేదు. ఆ విధంగా ఈ బిల్లు విషయంలో ఈ పార్టీలు చూపిస్తున్న నిర్లిప్త వైఖరికి నిరసన తెలియజేశారు.

ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖాలీద్ సైఫుల్లా రహ్మానీ మాట్లాడుతూ, ఈ నిరసన దేశవ్యాప్త ఉద్యమానికి నాందివాచకమన్నారు. పార్లమెంటులోను, పార్లమెంటు బయట కూడా ఈ బిల్లును బలంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

పర్సనల్ లా బోర్డు ఉపాధ్యక్షుడు, జమాఅతె ఇస్లామీ హింద్ అధ్యక్షుడు సయ్యద్ సాదతుల్లా హుస్సేనీ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు అంటే భారత ముస్లింల మతపరమైన హక్కులను కబళించ డమే అన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం మత వర్గాలకు తమ స్వంత మత సంస్థలను నిర్వహించే హక్కు ఉందని, ఈ బిల్లు ఆ హక్కుకు విరుద్ధమైనదని విమర్శించారు. అందువల్ల ఇది రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించారు. ఈ బిల్లు భారత విలువలకు విరుద్ధమైనదిగా వర్ణించారు. ఈ బిల్లును వ్యతిరేకిం చడం భారత పౌరులందరి బాధ్యత అని, ఇది కేవలం ముస్లిముల సమస్య కాదని చెప్పారు. వక్ఫ్ చట్టం వల్ల ముస్లిములకు ఏవో ప్రత్యేక హక్కులు లభించినట్లు చిత్రీకరించే ప్రయత్నం జరుగుతుందని, నిజానికి దేశంలోని ప్రతి మత సముదాయానికి లభించిన హక్కులే ముస్లిములకు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. మతపరమైన ఆస్తులు, అవి ఏ మతానికి సంబంధించినవి అయినా సరే లిమిటేషన్ నుంచి మినహాయింపు మాదిరి

సదుపాయాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రతి మత సముదాయానికి తమ మతపరమైన ఆస్తులను నిర్వహించుకునే హక్కు కూడా ఉందని చెప్పారు. కాని ఈ బిల్లు ద్వారా ముస్లిములకు వారి మతపరమైన ఆస్తుల నిర్వహణ హక్కు నిరాకరించే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. ముస్లింల హక్కులను కబళించే ఉద్దేశ్యపూర్వక ప్రయత్నంలో భాగమే ఈ బిల్లు అనే వాస్తవాన్ని మీడియా ప్రజలకు వివరించాలని, దీన్ని పూర్తిగా వ్యతిరేకించాలని ఆయన కోరారు. వక్ఫ్ ఆస్తులను మెరుగుపరచడానికి ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం చెప్పడాన్ని ఆయన విమర్శిస్తూ, ఈ బిల్లులో అలా వక్ఫ్ ఆస్తులను మెరుగుపరిచే ఒక్క అంశమైనా మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చూపించాలని, ఈ విషయమై మీడియా ఆయన్ను ప్రశ్నించాలని అన్నారు. “వక్ఫ్ బై యూజర్” నిబంధన తొలగించడం ద్వారా వక్ఫ్ ఆస్తులకు ఎలాంటి ప్రయోజనం కలిగిస్తున్నారో వివరించాలని ప్రశ్నించారు. అలాగే లిమిటేషన్ మినహాయింపు తొలగించడం వల్ల వక్ఫ్ ఆస్తులకు ఒరగబెట్టేదేమిటో చెప్పాలని అడిగారు. ప్రభుత్వవాదన అబద్ధాల పుట్ట అని, వక్ఫ్ బిల్లు వక్ఫ్ ఆస్తులను మెరుగుపరచడానికి కాదు, కబళించడానికి ఉద్దేశించిందని చెప్పారు. ఈ బిల్లు కేవలం ముస్లిం సమస్య మాత్రమే కాదని, ఇది రాజ్యాంగాన్ని కాపాడవలసిన సమస్య కూడా అన్నారు. ఈ బిల్లు రాజ్యాంగ మౌలిక విలువలను దెబ్బ తీస్తుందని వివరించారు. అందువల్ల భారతదేశంలోని ప్రజలంతా దీన్ని వ్యతిరేకించాలని, పార్లమెంటులో దీన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కేవలం ప్రారంభం మాత్రమేనని, ప్రభుత్వం బిల్లును ఉపసంహరించుకోకపోతే, దేశవ్యాప్తంగా నిరసనలు జరుపుతామని, ముస్లింలు, హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, అన్ని వర్గాల ప్రజలు ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ఏకమవుతారని చెప్పారు. ఈ బిల్లు పూర్తిగా ఉపసంహరించుకునే వరకు ఆందోళనను కొనసాగించాలని ప్రజలను కోరారు.

ఈ నిరసన కార్యక్రమంలో జమీఅతె ఉలమా ఏ హింద్ అధ్యక్షుడు మౌలానా మహమూద్ అసద్ మదనీ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లును ఖండించారు. ఇది రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి అన్నారు. భారత దేశాన్ని ప్రజాస్వామిక, ఆధునిక దేశంగా తీర్చిదిద్దడానికి మన పెద్దలు రూపొందించిన చట్రానికి ఈ బిల్లు విరుద్ధమైనదిగా వర్ణించారు. మా ఇళ్ళు, మస్జిదులు, మదర్సాలపై బుల్డోజర్లు ఉపయోగిస్తున్నారు, ఇప్పుడు రాజ్యాంగాన్ని కూడా బుల్డోజ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య కేవలం ముస్లింల సమస్య కాదని, ఇది మొత్తం దేశానికి సంబంధించిన సమస్య అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరి సమస్యగా చెప్పారు. ప్రజాస్వామిక సూత్రాలను గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ సంఘర్షణలో పాల్గొనాలని చెప్పారు. పోరాడకుండా గెలవగలమనుకుంటే పొరబాటవుతుందని చెబుతూ, అందరూ ఒక్కటై, బలంగా గొంతు వినిపించాలని పిలుపునిచ్చారు.

అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు వెనుక ఉన్న విభజనల ఎజెండాను వివరించారు. దేశంలోని ప్రజల మధ్య మతపరమైన విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి, సామరస్యభావనలను దెబ్బతీయడానికి ఉద్దేశించిందిగా చెప్పారు. ఈ బిల్లు వక్ఫ్ ఆస్తులను మెరుగుపరచడానికి కాదు, ముస్లిముల హక్కులను కాలరాయడానికి ఉద్దేశించిందిగా అభివర్ణించారు. ఈ బిల్లు విషయంలో ఆయన తెలుగుదేశం, ఆర్జెడి, పాశ్వాన్ పార్టీలను హెచ్చరిస్తూ, ఈ బిల్లుకు మద్దతిస్తే ముస్లిములు ఈ పార్టీలను ఎన్నడూ క్షమించరని చెప్పారు.

షియా సముదాయం నేత కల్బీ జవాద్ మాట్లాడుతూ ఈ బిల్లును పాముపుట్టగా వర్ణించారు. ముస్లిములకు హాని కలిగించేదిగా చెప్పారు. తుదివరకు దీనికి వ్యతిరేకంగా పోరాడతామన్నారు.

సమాజవాది పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా తమ పార్టీ పూర్తి మద్దతిస్తుందని ప్రకటించారు. అవసరమైతే త్యాగాలకు కూడా సిద్ధమన్నారు. మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షిద్ మాట్లాడుతూ ఈ పోరాటం సుదీర్ఘపోరాటమన్నది గుర్తుంచుకోవాలని, పార్లమెంటులోను, న్యాయపరంగాను పోరాడవలసిన అవసరముందని చెప్పారు. రాజ్యాంగ రక్షణ కోసం, దేశంలో బహుళత్వంలో ఏకత్వాన్ని కాపాడ్డానికి, న్యాయాన్ని నిలబెట్టడానికి ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు.

తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రా మాట్లాడుతూ తమ పార్టీ అధినేత్రి మమతాబెనర్జీ ఈ బిల్లును బలంగా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీలో ఈ బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకించామని అన్నారు. ముస్లిముల హక్కులను కొల్లగొట్టే ప్రయత్నాలు మానుకోవాలని ప్రభుత్వానికి హితవు గరిపారు. తమ పార్టీ పార్లమెంటులోను, పార్లమెంటు బయట కూడా ఈ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుతుందని చెప్పారు.

మౌలానా ఉబైదుల్లా ఖాన్ ఆజ్మీ మాట్లాడుతూ దేశంలోని ప్రతి మత సముదాయానికి తమ మతపరమైన ఆస్తులను నిర్వహించుకునే ఎండోమెంటులు, ట్రస్టులు ఉన్నాయని, కాని ప్రభుత్వం ఈ బిల్లు ద్వారా వక్ఫ్ ఆస్తులను హస్తగతం చేసుకోవాలనుకుంటుందని విమర్శించారు.

సిపిఎంకు చెందిన దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ బాహాటంగా ముస్లిముల భూములను దురాక్రమించుకునే ప్రయత్నమే ఈ బిల్లు అన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో పూర్తి మద్దతిస్తామన్నారు. సిపిఐ నేత హన్నాన్ మొల్లా మాట్లాడుతూ ఈ బిల్లు ముస్లిముల ప్రయోజనాలు కాపాడుతుందని చెప్పడాన్ని ఖండించారు. ఇది రాజ్యాంగవిరుద్ధమని, కార్పోరేట్ల ప్రయోజ నాల కోసం, పట్టణాల్లో కీలకప్రాంతాల్లో ఉన్న ముఖ్యమైన వక్ఫ్ ఆస్తులను లక్ష్యంగా చేసుకున్న ప్రయత్నమని చెప్పారు.

సిక్కు పర్సనల్ లా బోర్డుకు చెందిన ప్రొఫెసర్ జగ్మోహన్ సింగ్ మాట్లాడుతూ ముస్లిములకు పూర్తి సంఘీభావం ప్రకటించారు. మనం కలసి నిలబడితే మైనారిటీలం కాదు, మెజారిటీ అవుతామని, ఒండొరుల హక్కుల కోసం మనం కలసి పోరాడాలని చెప్పారు.

కాంగ్రెసు నాయకుడు ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ పార్లమెంటు లోపల, పార్లమెంటు బయట ఈ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుతామని, జాయింట్ పార్లమెంటరీ కమిటిలో కూడా ఈ బిల్లును బలంగా వ్యతిరేకించామని, ఈ పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

నిజానికి ఈ నిరసన ప్రదర్శన మార్చి 13వ తేదీన జరగవలసింది. కాని హోలీ పండుగ దృష్ట్యా వాయిదా వేసామని పర్సనల్ లా బోర్డు ప్రతినిధి డా. సయ్యద్ ఖాసీం రసూల్ ఇల్యాస్ అన్నారు. ఈ బిల్లు ముస్లిముల పట్ల వివక్షకు నిదర్శనమని చెప్పారు.

జంతర్ మంతర్ వద్ద ఈ నిరసన ప్రదర్శన రాజకీయ సమీకరణాలను ఎలా మారుస్తుందో చూడాలి. కాని జంతర్ మంతర్ వద్ద పర్సనల్ లా బోర్డు నిరసన ప్రదర్శనలో ప్రతిపక్ష నేతలు అంతా పాల్గొనడం ద్వారా ఇండియా కూటమి సమైక్యతను ఒకవైపు చాటి చెప్పడంతో పాటు, మరోవైపు సోకాల్డ్ సెక్యులర్ పార్టీలుగా ఉంటూ ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతిచ్చి నిలబెడుతున్న తెలుగుదేశం, జేడీయు పార్టీలపై కూడా ప్రభావం వేస్తుందని చెప్పక తప్పదు. చంద్రబాబునాయుడు, నితీష్ కుమార్, పాశ్వాన్, జయంత్ వంటి నేతలు ఇప్పుడు మోడీ ప్రభుత్వానికి మద్దతుగా నిలబడతారా?


ఎందుకంటే బీహారులో ఎన్నికలు జరగవలసి ఉంది. ఎన్నికలకు ముందు ముస్లిం ఓట్లను పోగొట్టుకునే పరిస్థితిని నితీష్ కుమార్ కొని తెచ్చుకుంటాడా?

మోడీ ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలిస్తే, ముస్లిములను లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకుంటే మెజారిటీ హిందువులు సంతోషించి ఓట్లు వేస్తారనే ధోరణి కనిపిస్తుంది. ఇది నిజంగా జరుగుతుందా? లోక్‌సభ ఎన్నికల్లో దానికి విరుద్ధంగా ఫలితాలు వచ్చాయి. ఉదాహరణకు ట్రిపుల్ తలాక్‌ను తీసుకోండి. ఇందులో క్రిమినల్ శిక్షలు విధించే చట్టం తీసుకువచ్చారు. కాని ఎవరైనా భార్యను విడాకులివ్వకుండానే వదిలేస్తే దానికి శిక్ష ఏమిటి? ఇలా చేసేవారు అన్ని మత సముదాయాల్లోనూ ఉంటారు. విడాకుల వ్యవహారంలో క్రిమినల్ శిక్షలు ఇతర మతసముదాయాలకు ఎవరికీ లేవు. ఇది ముస్లిం వ్యతిరేకతకు ఒక ఉదాహరణ. యూనిఫాం సివిల్ కోడ్‌ను తీసుకుందాం. ఉత్తరాఖండ్‌లో యూనిఫాం సివిల్ కోడ్ అన్నారు. కాని చాలా సముదాయాలకు మినహాయింపు ఇచ్చారు. మినహాయింపులు ముస్లిములకు మాత్రం లేవు. మరలాంటప్పుడు అది యూనిఫాం సివిల్ కోడ్ ఎలా అయ్యింది? ముస్లిం వ్యతిరేకతకు ఇది మరో ఉదాహరణ. పౌరసత్వ సవరణ చట్టం, ఎన్నార్సీల విషయంలో వినవచ్చిన ప్రసంగాల్లో ముస్లిం వ్యతిరేకత ద్వారా మెజారిటీలను సంతోషపెట్టి ఓట్లు రాల్చుకోవా లనే ప్రయత్నమే ఉంది. ఈ వక్ఫ్ ఖిల్లు కూడా అలాంటిదే. ముస్లిముల మతపరమైన ఆస్తుల వ్యవహారాల నిర్వహణలో హిందువులను కూడా సభ్యులుగా వక్ఫ్‌బోర్డులో పెట్టాం చూడండి అని చెబితే మెజారిటీ వర్గం ఎంతో సంతోషించి ఓట్లేస్తుందన్న అంచనాలతో పాటు ముస్లిముల వక్ఫ్ ఆస్తులను కార్పోరేట్ ప్రయోజనాల కోసం వాడుకునే వ్యూహాలు కూడా దీని వెనుక ఉన్నాయి.

కాని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన ప్రదర్శన తర్వాత నితీష్ కుమార్, చంద్రబాబునాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ప్రశ్న. ఈ రెండు పార్టీల వైఖరి వల్లనే వక్ఫ్ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించవలసి వచ్చింది. అక్కడ ఎలాంటి ప్రహసనాలు జరిగాయో చెప్పడం చర్వితచర్వణమే.

వక్ఫ్ బిల్లు ప్రకారం వక్ఫ్ బోర్డులో హిందువులకు సభ్యులయ్యే మార్పు, వక్ఫ్ ఆస్తులపై కలెక్టర్లకు నిర్ణయాధికారం ఈ రెండు అంశాలు చాలా కీలకమైనవి. ఈ బిల్లుకు నితీష్ కుమార్ మద్దతిస్తే బీహారు ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తప్పవు. చంద్రబాబు నాయుడుకు కూడా రాజకీయంగా భవిష్యత్తులో తీవ్ర సమస్యలు తప్పవు. వీరిద్దరు మాత్రమే కాదు చిరాగ్ పాశ్వాన్, జయంత్ షాలు కూడా దీనివల్ల రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాబట్టి బిలులో వివాదాస్పదమైన ఈ అంశాలను సవరించడం లేదా ప్రస్తుతానికి బిల్లును వాయిదా వేయడంపై ఈ పార్టీలు ఒత్తిడి తీసుకొస్తాయా?

❖ ❖ ❖




# వక్ఫ్ ఆస్తుల దురాక్రమణకే సవరణ బిల్లు

**- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

**గత కొంత కాలంగా** వక్ఫ్ ఆస్తులకు సంబంధించి దేశవ్యాప్త చర్చ కొనసాగుతోంది. ముస్లిం సంస్థలు, పౌర సంఘాలు, విపక్ష సభ్యులు వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ తమ అభ్యంతరాలను వ్యక్తం చేసినప్పటికీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇదేమీ పట్టించుకోకుండా ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మార్చి 17న దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ధర్నాకు పిలుపునిచ్చింది. బిల్లు ఆమోదం పొందకుండా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అడ్డుకోవాలని ముస్లిం సంస్థలు, పౌర సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ముస్లింలకు వ్యతి రేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఎటువంటి నిర్ణయాన్నయినా అడ్డుకొని తీరతానని ఎన్నికలకు ముందు చంద్రబాబు చేసిన వాగ్దానాన్ని ముస్లిం నేతలు గుర్తు చేస్తున్నారు. వక్ఫ్ ఆస్తులన్నవి పూర్తిగా ముస్లిం సమాజానికి చెందిన ఆస్తులు. షరీఅత్ పరిభాషలో ఎవరైనా ఒక వ్యక్తి తనకు చెందిన ఆస్తిపై లేక వస్తువుపై తన హక్కును, యాజమాన్యాన్ని పూర్తిగా వదులుకొని దైవానికి దఖలు పరచడాన్ని 'వక్ఫ్' అంటారు. అంటే ఏదేని భూమి, వస్తువు లేక మరేదైనా వక్ఫ్ చేసిన తరువాత ఇక తనకు కాని, తన వారసులకు కాని మరెవరికైనా దానిపై ఏ విధమైన హక్కూ అధికారం ఉండదు. అది పూర్తిగా దైవానికే చెందిన ఆస్తి. ముస్లింలు దానికి అమానతుదారులు / ట్రస్టీలు. ప్రవక్త కాలంలో ప్రారంభమైన వక్ఫ్ భావన ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ కొనసాగుతోంది. భారత దేశాన్ని రమారమి వెయ్యేళ్ళ పాటు పాలించిన ముస్లిం రాజులు అసంఖ్యాక మసీదులు, ఖబ్రస్తాన్‌లు, దర్గాలు, విద్యాలయాలకు విలువైన భూములు, ఆస్తులు వక్ఫ్ చేశారు. వీటి నిర్వహణలో ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా నిరాటంకంగా కలకాలం కొనసాగడానికి ఈ ఆస్తులు దోహదపడాలని వాటిని దేవుని పేర అంకితం చేశారు. కనుక వక్ఫ్ ఆస్తులపై ఎవరికీ ఎటువంటి హక్కూ, అధికారము ఉండదు. అవి కేవలం అర్హత కలిగిన పేదసాదల సంక్షేమానికి, వాటి నిర్వహణకు మాత్రమే వినియో గించబడాలి. కాని ఈస్ఫూర్తికి భిన్నంగా ఆంగ్లేయుల కాలంలో వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగం మొదలైంది. అప్పుడు ముస్లింలు దీన్ని అడ్డుకోవడంతో వక్ఫ్ యాక్ట్ 1923 ఉనికి లోకి వచ్చింది. 1954లో పూర్తి స్థాయిలో వక్ఫ్ యాక్ట్‌ను ప్రవేశ పెట్టారు.

అనేక సందర్భాల్లో సవరణలు జరిగాయి. ఇప్పుడు తాజాగా నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులపై కన్నేసి చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టింది. ఎందుకంటే మనదేశంలో సైన్యం, రైల్వే తరువాత అత్యధిక ఆస్తులు వక్ఫ్‌బోర్డు దగ్గర మాత్రమే ఉన్నాయట. (90% ఆక్రమణలోనే సుమా!) ఎలాగైనా ఈ ఆస్తుల్ని ముస్లింల దగ్గరి నుండి లాగేసుకోవాలని, ఇప్పటికే తమ అస్మదీయుల కబ్జాల్లో ఉన్న ఈ వేల కోట్ల ఆస్తుల్ని క్రమబద్ధీకరించుకోవా లన్నది మోషా అండ్ కో దుష్ట పన్నాగం. బిల్లును గనక నిశితంగా పరిశీలిస్తే మోదీ ప్రభుత్వ కపట ప్రేమ, దురుద్దేశం స్పష్టంగా అర్థమవుతుంది. సరాసరి ముస్లింల ధర్మంలో, వారి వ్యక్తిగత వియయాల్లో వేలు పెట్టడం, ధర్మపరంగా వారికున్నటువంటి ప్రత్యేకతను దెబ్బతీయడం లక్ష్యంగా కనబడుతోంది. భాజపా సర్కార్ ప్రతిపాదించిన సవరణ బిల్లు ప్రకారం ముస్లిమేతరులు కూడా బోర్డు మెంబర్లుగా, సీఈఓలుగా ఉండవచ్చునట. కాని, ప్రతిపాదిత చట్టం ప్రకారం, తమ ఆస్తుల్ని వక్ఫ్ చేయడానికి ముస్లిమేతరులు అర్హులు కానప్పుడు ఎక్జిక్యూటివ్‌లుగా, సీఈవోలుగా ఎలా అర్హులు అవుతారన్న దానికి సహేతుక సమా ధానం లేదు. అంటే చట్ట సవరణ ద్వారా తమ వారిని (సంఘీయులను) బోర్డులోకి పంపి వక్ఫ్ ఆస్తుల్ని క్రమక్రమంగా కాజేయడం అసలు ఉద్దేశ్యం.ఈ సవరణల్లో ఉన్న మరో దుర్మార్గం ఏమిటంటే, ఏ ఉద్దేశ్యం కోసం ముస్లింలు తమ ఆస్తుల్ని వక్ఫ్ చేశారో, అది కాకుండా ప్రభుత్వం తన ఇష్టం వచ్చిన పద్దుల్లో వెచ్చిస్తుందట. ఇది వక్ఫ్ మూల సూత్రానికే వ్యతిరేకం. మరో గమ్మత్తయిన విషయం ఏమిటంటే, ఎవరైతే ఇస్లాం ధర్మాన్ని ఐదేళ్ళుగా ఆచరిస్తున్నారో వారే వక్ఫ్ చేయడానికి అర్హులట. ఇస్లాం ధర్మాన్ని స్వీకరించి ఐదేళ్ళు పూర్తికానివారు తమ ఆస్తుల్ని దానం చేస్తామంటే ఈ కొత్తచట్టం ఒప్పుకోదు. ఇది కూడా వక్ఫ్ సూత్రానికి, స్ఫూర్తికి వ్యతిరేకమే. ఎందుకంటే ఇస్లాంప్రకారం ముస్లిమేతరులు కూడా వక్ఫ్ చేయడానికి అర్హులే. కాని ఇదేమి చట్టమో ముస్లిం అయిఉండి కూడా వక్ఫ్ చేస్తానంటే ఈ చట్టం ఒప్పుకోవడంలేదు. నిజానికిది ఒక ముస్లింను తన ధర్మపరమైన ఆరాధన చేయవద్దని అడ్డుకోవడమే. భారత రాజ్యాంగంలోని 25 వ అధికరణ ప్రకారం ప్రతి వ్యక్తీ స్వేచ్ఛగా తనకు నచ్చిన మతాన్ని స్వీకరించే, ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కును కలిగి ఉన్నాడు. ఆర్టికల్ 26 ప్రకారం ప్రతి ఒక్కరూ తమ మతం శాఖలను, ధార్మిక కార్యకలాపాలకోసం సంస్థలను స్థాపించుకొని, వాటిని నిర్వహించుకొనే హక్కునూ కలిగి ఉన్నారు. రాజ్యాంగ ప్రసాదితమైన ఈ హక్కును కాలరాసే అధికారం ఎవ్వరికీ లేదు. అలాగే ఈ సవరణ బిల్లులో ఉన్న మరో దుర్మార్గం ఏమిటంటే, వక్ఫ్ ఆస్తులకు సంబంధించి ఏదైనా వివాదం తలెత్తితే నిర్ణయాధికారం జిల్లా కలెక్టర్లకు దఖలు పరచడం జరిగింది. ప్రస్తుతమైతే వివాద పరిష్కారానికి హైకోర్టు న్యాయమూర్తి నియమించిన వక్ఫ్ ట్రిబ్యునల్ ఉంది. దీన్ని కాదని కలెక్టర్లకు నిర్ణయాధికారం కట్టబెడితే వాళ్ళు పాలకులకే వత్తాసు పలికే అవకాశాలు ఎక్కువ. మసీదు, మదర్సా, దర్గా, ఈద్గా తదితరాల విషయంలో ఏ చిన్న సమస్య తలెత్తినా దాన్ని ప్రభుత్వ ఆస్తిగా కలెక్టర్లతో రాయించేసుకోవడం ప్రభుత్వాధినేతలకు పెద్ద లెక్కకాదు. నాలుగైదు వందల ఏళ్ళనాటి మసీదులు, దర్గాలు, ఖబ్రస్తాన్ల రికార్డులు ఇప్పుడు కావాలంటే ఆచరణాత్మకంగా జరిగేపని కాదు. ఈ విధంగా కూడా కేంద్ర సర్కారు ముస్లింల ఆస్తుల్ని కొల్లగొట్టి వారి నోట్లో మన్నుకొట్టాలని చూస్తోంది. నిజానికి ధర్మం ప్రకారం, కొందరు సాక్షుల సమక్షంలో నేను నా ఫలానా ఆస్తిని దేవుని పేర వక్ఫ్ చేస్తున్నాను అన్నా అది వక్ఫ్ గా పరిగణించబడుతుంది. మరి ఆ ఐందొందల ఏళ్ళనాటి సాక్షులు ఇప్పుడు ఉంటారా? అంతేకాదు, మరో కుట్ర ఏమిటంటే, కొత్త బిల్లు ప్రకారం వక్ఫ్ భూమిని ఆక్రమించుకుని పన్నెండేళ్లుగా అనుభవిస్తున్న వ్యక్తులు ఈ సవరణల పుణ్యమా అని ఆ భూమికి యజమానులుగా మారిపోతారు. కాబట్టి వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదించడమంటే, నిస్సందేహంగా ముస్లింల విలువైన ఆస్తుల్ని తేరగా కొల్లగొట్టడం, ఇప్పటికే కబ్జాకోరుల కబంధ హస్తాల్లో ఉన్న ఆస్తుల్ని క్రమబద్ధీకరించి వారికి ధారాదత్తం చేయడానికి మాత్రమే మోదీ సర్కారు తీసుకురా దలచుకున్న దుర్మార్గమైన నిర్ణయంగా పరిగణించాల్సి ఉంటుంది. దాతృత్వం అనే భావనను నిర్వీర్యం చేసి ఆక్రమణదారులను, కబ్జాకోరులను ఆస్తులకు యజమానులుగా మార్చాలనుకుంటున్న ప్రతిపాదిత దుర్మార్గపు బిల్లును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నిర్ద్వంద్వంగా తిరస్కరించి బిల్లు ఆమోదం పొందకుండా చూడాలి. తాము ఎన్డీయేలో ఉన్నప్పటికీ ముస్లింల సంక్షేమానికి తూట్లు పొడిచే ఎటువంటి కార్యక్రమాలను అనుమతించబోమని పదే పదే ప్రకటించిన ఈ నేతలు ఆచరణాత్మకంగా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుంటే బిల్లు ఆమోదంపొందడం నూటికి నూరుపాళ్ళు అసాధ్యం. ఎందుకంటే బాబు మోదీ జిగ్రీ దోస్తానా కారణంగా బాబు మాటను మోదీ కాదనే ప్రసక్తే లేదు. మరి బాబుగారు మాటకు కట్టుబడి మోదీని ఒప్పిస్తారో, పాత బుద్ధిని ప్రదర్శిస్తూ అంతరాత్మను వంచించుకుంటారో కొద్దిరోజుల్లోనే తేలనుంది. ✤





# ఔరంగజేబు చుట్టూ రాజకీయాలు

ఉమైర్

**ఒక సమాధి... దానిపై గగ్గోలు... చివరకు మత ఘర్షణలు**

సమాధి గురించి ఒక జోకు గుర్తుకు వస్తోంది. ఒక సంపన్నుడు తన తండ్రి సమాధిని కాంక్రీటు, ఇటుకలతో చక్కగా కట్టించాడట. అతని మిత్రుడు పేదవాడు, తన తండ్రి సమాధి మట్టితో కట్టించాడు. అది ఎంతోకాలం ఉండదు. సంపన్నుడు తన మిత్రుడితో చూశావా మా నాన్నగారి సమాధి ఎంత బలంగా కట్టించానో అన్నాడట. పేదవాడు ఆ మాట విని తన మిత్రుడితో, తీర్పుదినాన మా నాన్నగారైతే పెద్దగా శ్రమపడకుండా మట్టి పక్కకు నెట్టేసి బయటకు వచ్చేస్తారు, కాని కాంక్రీటు, ఇటుకలతో కట్టిన సమాధి నుంచి బయటకు రావాలంటే మీ నాన్న చాలా కష్టపడాలి కదా అన్నాడట. ఇది జోకుగా అనుకుంటే జోకు. కాస్త లోతుగా ఆలోచిస్తే సమాధుల వాస్తవికతను చాటి చెప్పేమాట.

ఔరంగజేబు సమాధి ఇప్పుడు ఇంత కల్లోలానికి కారణమైందంటే కాస్త ఆశ్చర్యమేస్తుంది. నాగపూర్ తగలబడింది.

మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో మతపరమైన హింస చెలరేగింది. కనీసం డజను మందికి గాయాలయ్యాయి. ఆస్తులు నష్టపోయాయి. దహనకాండ జరిగింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఔరంగజేబు సమాధి ఉంది. దాన్ని అక్కడి నుంచి తవ్వి తొలగించి, దాని నామరూపాలు లేకుండా చేయాలని కొందరు డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. భజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు ఔరంగజేబు దిష్టిబొమ్మతో పాటు పవిత్ర ఖుర్‌ఆన్ ప్రతిని కాల్చివేశారని పుకార్లు వేగంగా వ్యాపించాయి. రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ పుకార్లు ప్రచారం చేయడంలో ఎవరు సిద్ధహస్తులో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఔరంగజేబు సమాధి అక్కడ వందల సంవత్సరాలుగా ఉంది. గత పది సంవత్సరాలుగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉంది. మహారాష్ట్రను కూడా బీజేపీ ప్రభుత్వమే పాలిస్తూ వస్తోంది. ఔరంగజేబు సమాధిపై తీవ్రమైన వ్యతిరేకత ఉంటే ఆ సమాధిని అక్కడి నుంచి తవ్విపారేయడానికి వచ్చిన అడ్డంకేమిటి? ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంరక్షణలో ఆ ప్రదేశం ఉందనడం పెద్ద కారణంగా కనిపించదు. ఎందుకంటే సంరక్షిత ప్రదేశాల జాబితా నుంచి ఆ సమాధిని తొలగించడం ప్రభుత్వానికి పెద్ద కష్టమేమీ కాదు. ఒకసారి నోటిఫై చేసి, ఆ తర్వాత సమాధిని తవ్వి పారేయవచ్చు కదా. గత పది సంవత్సరాలుగా ఈ పనెందుకు చేయలేదో?

ఇప్పుడు ఔరంగజేబు సమాధిపై రాజకీయాలు మొదలయ్యాయి. ఫలితంగా మత ఘర్షణలు ఎన్నడూ జరగని నాగపూర్ వంటి ప్రాంతాల్లో కూడా ఉద్రిక్తతలు పెచ్చరిల్లాయి.

ఈ ఉద్రిక్తత రెచ్చగొట్టిందెవరు? ఎవరికి దీనివల్ల ప్రయోజనం? నాగపూర్ నుంచి ఈ విద్వేషాగ్ని ఎక్కడెక్కడికి వ్యాపిస్తుందో అన్న భయాలు ఇప్పుడు చాలా మందిని వెంటాడుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఎలా మహారాష్ట్రలో మతపరమైన విద్వేషం రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగాయో చెప్పవనసరం లేదు. ఇప్పుడు

ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ స్వయంగా ఔరంగజేబు సమాధిపై చేసిన వ్యాఖ్యలు విద్వేషాగ్నికి ఆజ్యం పోయలేదా? ప్రస్తుతం మహారాష్ట్రకు 9.32 లక్షల కోట్ల రూపాయల అప్పులు న్నాయి. ఇది  పెద్ద సమస్యా? లేక ఔరంగజేబు సమాధి పెద్ద సమస్యా? ఔరంగజేబు సమాధి తవ్విపారేస్తే ఈ అప్పు తీరిపోతుందా?  మహారాష్ట్రలో  రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అవార్డు గ్రహీత అయిన రైతు ఆత్మహత్య వార్త కూడా వచ్చింది. ఈ సమస్య పెద్దది కాదా? మహారాష్ట్రలో లాడ్ కి బహెన్ పథకం పరిస్థితేమిటి? ప్రజలకు ఏమన్నా ఇస్తు న్నారా?  ఇచ్చింది వెనక్కు తీసుకుంటున్నారా? ఈ వివరాలు ప్రజలకు తెలియకుండా ఉండాలంటే ఔరంగజేబు సమాధిపై గగ్గోలు ఉపయోగపడుతుంది. అలా కాకపోతే కేంద్రంలోను, రాష్ట్రంలోను అధికారంలో ఉన్న బీజేపీ తలచుకుంటే ఔరంగజేబు సమాధిని  తవ్వి పారేయడం పెద్ద కష్టమా? ఎందుకు  గత పదేళ్ళుగా ఈ పని చేయలేదు. ఎందుకంటే ప్రజలు చాలా విషయాలు ఆలోచించకుండా ఉండాలంటే ఇలాంటి సమాధులు తవ్వే కార్యక్రమాల ప్రచారం అవసరం.

రాహుల్ గాంధీ ఇటీవల ఓటర్ల జాబితాపై అడుగుతున్న ప్రశ్నలపై ప్రజలు ఆలోచించకుండా  ఉండాలంటే వందల సంవత్సరాల సమాధి పనికొస్తుంది. మొదటి ప్రశ్న ఏమిటంటే, మహారాష్ట్రలో గత ఐదేళ్ళుగా ఎంతమంది పేర్లు ఓటర్ల జాబితాలో చేర్చడం జరిగిందో అంతమంది పేర్లు గత ఐదునెలల కాలంలోనే చేర్చడం కూడా జరిగిందన్నారు. రెండవ ప్రశ్న. మహారాష్ట్రలో వయోజనుల సంఖ్య 9.54 కోట్లు. కాని ఓటర్ లిస్టులో ఓటర్ల సంఖ్య 9.70 కోట్లు. జనాభా కన్నా ఎక్కువగా ఓటర్లు ఎక్కడి నుంచి వచ్చారు?

అందుకే చట్టబద్ధంగా ఔరంగజేబు సమాధిని తొలగించడానికి ప్రయత్నిస్తాం అన్నారు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్. ఎందుకంటే కాంగ్రెసు ప్రభుత్వకాలంలో ఈ ఔరంగజేబు సమాధిని పురావస్తు శాఖ సంరక్షణ  జాబితాలో  చేర్చడం జరిగిందట. కాంగ్రెసు చేరిస్తే మీరు తొలగించండి. మిమ్మల్ని ఆపిందెవరు? దీనిపై రాజకీయాలెందుకు?

దేశాన్ని ఐదు బిలియన్ల ఎకానమిగా మార్చేస్తామనే నినాదాలు. కాని రాజకీయాలు మాత్రం  హిందూ ముస్లిం మతతత్వ రాజకీయాలు. ఇప్పుడు వందల సంవత్సరాల పాత సమాధి చుట్టూ రాజకీయాలు. టీవీలో ఇప్పుడు ఔరంగజేబు సమాధే. చివరకు నాగపూర్‌లో హింసాకాండకు దారి తీసింది.

ఇటీవల వచ్చిన ఛావా సినిమా గురించి కూడా ఇక్కడ చెప్పు కోవాలి.  ఔరంగజేబు అత్యంత క్రూరమైన చక్రవర్తి అని చూపించారు. స్వయంగా మోడీ గారు ఈ సినిమా గురించి గొప్పగా మాట్లాడారు. పాఠకులకు ఆసక్తి ఉంటే శంభాజీ మహరాజ్ గురించి గురుగొల్వాల్కర్, వీర్ సావర్కర్‌లు ఏం రాశారో కాస్త గూగుల్ చేసి చూసుకోవచ్చు. ఇక్కడ మళ్ళీ నేను రాయవలసిన అవసరం లేదు. ఈ సినిమాలో ఎంత చరిత్ర ఉందో తెలియదు కాని సినిమాల ద్వారా చరిత్ర చదువు కుంటున్న వారు రెచ్చిపోయిన దృశ్యాలు, ఆగ్రహంతో కేకలు పెడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో కూడా చాలా మంది చూసే ఉంటారు. చివరకు ఛావా సినిమా పేరుతో మరోసారి ఔరంగజేబు మహా.. మహా.. మహా.. క్రూరుడనే చర్చ ప్రజల్లో వచ్చేలా చేసారు. ఆ విధంగా చాలా ప్రజాసమస్యలపై ప్రజలు ఆలోచించే పరిస్థితే లేని వాతావరణం ఏర్పడేలా చేయడంలో మన టీవీ చానళ్ళు కూడా యథాశక్తి సహకారం అందించాయి. ఔరంగజేబుపై ద్వేషాన్ని మరింత రెచ్చగొట్టడానికి మహారాష్ట్ర ఔరంగాబాద్‌లోని ఔరంగజేబు  సమాధిని తవ్వి పారేయాలన్న ఆందోళన మొదలుపెట్టారు. స్వయంగా ఫడ్నవిస్ ఈ మాటలు చెప్పాడు. బీజేపీ నేతలు, బీజేపీ మిత్రపక్షంగా ఉన్న శివసేన షిండే గ్రూపు నేతలు ఈ మాటలే చెప్పారు. ప్రజలు ఇంకా ఇతర సమస్యలేవీ ఆలోచించే పరిస్థితే లేదు, ఓటర్ల లిస్టు గురించి పట్టించుకునే తీరికే లేదు, రైతు ఆత్మహత్యల గురించి చింతే లేదు, మహారాష్ట్ర అప్పులపాలైన పరిస్థితిపై బాధే లేదు. అన్నింటికి ఒకే ఒక్క పరిష్కారం ఔరంగజేబు సమాధిని తవ్విపారేయడం. అది చేయడం కూడా కేంద్రంలోను, రాష్ట్రంలోను అధికారంలో ఉన్న బీజేపీకి చాలా తేలిక. కాని ఆ పని చేస్తే అందులో రాజకీయ ప్రయోజనమేముంటుంది? ఆ పని చేస్తామంటూ ప్రజల మనోభావాలతో ఆడుకోవడంలోనే రాజకీయ ప్రయోజనం ఉంది. ఈ రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకోకపోతే, పెరుగు తున్న ధరలు, నిరుద్యోగ సమస్య, పేదరికం వంటి సమస్యలను మరిచిపోయి ఈ సమాధుల  సమస్యే  ముఖ్యమైపోతే 5 బిలియన్ల ఎకానమీగా మార్చేసినట్లవుతుందా? ఆలోచించాలి.

❖

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# ముస్లిం జనాభా - అపోహలు

**కవి కరీముల్లా**

**మన** దేశంలో ముస్లిం జనాభా నానాటికీ పెరిగిపోతుందని కొన్ని శక్తులు అనేక సంవత్సరాలుగా గోబెల్స్ ప్రచారం చేస్తూ ఉన్నాయి. భవిష్యత్తులో ఇండియా ఇస్లాం రాజ్యంగా మారిపోతుందని, హిందువులు మైనారిటీలుగా మారిపోతారని అబద్ధ ప్రచారాలు తాండవిస్తున్నాయి. తత్ ఫలితంగా దాదాపు అన్ని వర్గాలలోనూ ముస్లిం జనాభా యిబ్బడి ముబ్బడిగా పెరిగిపోతుందనే భావన ఎక్కువైంది. “హమ్ పాంచ్ హమ్‌కో పచ్చీస్” అని ముస్లిం జనాభాను ఉద్దేశించి గేలిచేసిన సందర్భాలూ ఉన్నాయి. ముస్లిం జనాభా పెరిగిపోతే భవిష్యత్తులో భారత్ ముస్లిం రాజ్యంగా మారుతుంది కనుక హిందువులంతా తమ జనాభా పెంచేసుకోవాలని సలహాలిచ్చిన మతతత్వ నాయకులూ ఉన్నారు. ఇలాంటి విష ప్రచారాల వల్ల ముస్లింలపై అనేక అపోహలు ఎక్కువయ్యాయి.

అయితే ఈ బూటకపు ప్రచారాన్ని సచార్ కమిటీ నివేదిక ఎండగట్టింది. ఇది కేవలం కుహనా ప్రచారం మాత్రమేనని గణాంకాలతో సహా తేల్చి చెప్పింది. ఇంకా చెప్పాలంటే ముస్లిం జనాభా తగ్గుముఖం పడ్తుందని కూడా స్పష్టం చేసింది. ముస్లిం సమాజం తీవ్రమైన దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తుందనీ, వారి జీవన ప్రమాణ స్థాయి దారుణంగా ఉందని తెలియజేసింది. ముస్లింలను మతపరమైన విశ్వాసాల కన్నా సామాజిక, ఆర్థిక స్థితిగతులే శాసిస్తున్నాయని తెలియ జేయటమే గాక వారు నిత్యం అభద్రతా భావంలో మగ్గుతున్నారని తన సుదీర్ఘ రిపోర్ట్‌లో పేర్కొంది. ఇక గణాంకాల్ని పరిశీలిస్తే 2001 జనాభా లెక్కల ప్రకారం హిందూ జననాల రేటుకు, ముస్లిం జననాల రేటుకు పెద్దగా వ్యత్యాసం లేదని తెలుస్తుంది. 2001లో జాతీయ జనాభా లెక్కల సంస్థ ప్రకటించిన జనాభా వివరాల్ని బట్టి మొత్తం దేశ జనాభా 43.9 కోట్ల నుండి 100.2 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో సగటు జనాభా పెరుగుదల 13.4 శాతంగా ఉంది. ముస్లిం జనాభా 13.8 కోట్లుగా ఉంది. దీనిని బట్టి హిందూ జనాభా ఏ స్థాయిలో పెరిగిందో ముస్లిం జనాభా కూడా అదే స్థాయిలో పెరిగిందే తప్ప ప్రత్యేకంగా ఎక్కువగా వృద్ధి చెందలేదని అర్థమౌతుంది. ఇదే నిష్పత్తి ప్రాతిపదికగా హిందూ, ముస్లిం జననాల రేటును మరింత లోతుగా విశ్లేషిస్తే హిందూ జనాభాతో పోలిస్తే ముస్లిం జనాభా తగ్గుతుందని కూడా స్పష్టమౌతుంది. అదెలాగంటే మెజారిటీ సమాజంగా వున్న హిందూ జననాల రేటు మైనార్టీ సమాజంగా వున్న ముస్లిం జననాల రేటుకు సమానంగా వున్నందున ముస్లింలకన్నా హిందూ జనాభా మూడింతలుగా పెరిగిందని యిట్టే చెప్పవచ్చు.

మరో విధంగా కూడా ముస్లిం జనాభా తగ్గుతోందని విశ్లేషించవచ్చు. 1981-91రేటు 32.9 శాతంగా వుంటే 1991-2001 నాటికి 29.5శాతానికి తగ్గింది. అంటే సుమారు 3.4 శాతానికి తగ్గింది. జనాభా నియంత్రణలో ప్రజల్ని ప్రోత్సహించడంలో బాగా వెనుక బడ్డాయని చెప్పబడుతున్న రాష్ట్రాలలో కూడా ముస్లిం జనాభా పెరిగిందేమీ లేదని సచార్ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. విద్యావిషయికంగా బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాలుగా చెప్పబడుతున్న దక్షిణాది ప్రాంతాలలోనైతే జాతీయ సగటు జనాభా పెరుగుదల రేటు కన్నా ముస్లిం జనవాల రేటు బాగా పడిపోయిందని నివేదిక వెల్లడించింది. వాస్తవాలు ఇలా వుంటే అవాస్తవాలు మాత్రం పుంఖాను పుంఖాలుగా విస్తరిస్తూ అగాథాల్ని సృష్టిస్తూనే ఉన్నాయి. సత్యం చెప్పులు తొడుక్కునేలోపు అసత్యం భూప్రదక్షిణం చేసి వస్తుందనే నానుడిని ఈ ప్రచారాలు నిజం చేస్తున్నాయి.

ప్రపంచ జనాభాలో అగ్ర స్థానంలో వున్న చైనా అభివృద్ధి పథంలో ఓ వైపు దూసుకుని వెళ్తూ వుంటే మనం మాత్రం ఇంకా కుల, మతాల కొట్లాటల చీకట్లలోనే తచ్చాడుతున్నాం. జనాభా ఎంత పెరిగిందీ, ఎంత తగ్గిందీ అనేది సమస్య కాకూడదు. దేశాభివృద్ధిలో ఏ మేరకు పాలు పంచుకున్నామనేది ఆత్మ శోధన చేసుకోవాల్సిన సందర్భం యిది. చివరికి కుటుంబ నియంత్రణను ప్రచారం చేసే వైద్య ఆరోగ్య శాఖ ప్రకటనల్లో కూడా ముస్లింల చిత్రాలు చూపిస్తూ ముస్లింలు జనాభా తగ్గించుకోవాలనే పరోక్ష సందేశాలు పంపిస్తున్నారు. అనేక వైద్య, ఆరోగ్య పరమైన అనుమానాలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న వారిలో ఎక్కువగా ఉన్నాయి. ఈ కారణం వల్లనే కుటుంబ నియంత్రణ పట్ల దాదాపు అన్ని వర్గాల పేద ప్రజలు అంతగా ఆసక్తి చూపరు. పైగా గ్రామీణ ప్రాంతాలలో కొన్ని పేద కుటుంబాలలో సంతానం తమ ఆర్థికావసరాలను తీరుస్తుందనే నమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. ఇది నిజం కూడా. అంతేకాని వీటికి మతంతో సంబంధం లేదు. ముఖ్యంగా ముస్లింలకు సంబంధించి మతపరమైన ఉద్దేశాలను అంటగడ్తూ ప్రచారం చేసినందు వల్ల వాటి ప్రతిఫలాలు ఫాసిజం అభివృద్ధికి తోడ్పడతాయి. ఉదాహరణకు గతంలో గుజరాత్ మారణకాండలో ఒక ముస్లిం స్త్రీ గర్భాన్ని చీల్చి పిండాన్ని వెలికి తీసి మంటల్లోకి విసిరిన పాశవిక చర్య యాదృచ్ఛికంగా జరిగింది కాదు. అక్కడ ఆ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తి నామమాత్రుడే. కానీ అతనిపై ముస్లిం జనాభా పెరుగుతుందనే గోబెల్స్ ప్రచార ప్రభావం ఉండి వుంటుంది. కనుక సమాజంలోని లౌకిక వాదులు మత సామరస్య విలువల్ని ప్రబోధిస్తూ దుష్ప్రచారాల్ని నిరోధించవల్సిన అవసరం వుంది. ఒక సమాజం పట్ల అపోహలు ఎక్కువైతే దాని పర్యవసానాలు భయంకరంగా ఉంటాయి.కనుకే ముస్లిం సమాజంపై దాడులు ఎక్కువయ్యాయి. ఈ దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ముస్లిం సమాజం సామరస్యాన్ని కోరుకుంటుందనే వాస్తవిక సత్యాన్ని తతిమ్మా సమాజాలకు తెలియజేయాల్సిన బాధ్యత ముస్లిం విద్యావంతులపై ఉంది. ముందు ముస్లిం విద్యావంతులు తాము ఇస్లామోఫోబియా నుండి బయటపడితేనే అది సాధ్యం అవుతుంది.

యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

1

# కుటుంబ వ్యవస్థను కాపాడుకుందాం!



**సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**ఈ సంతానం, సిరిసంపదలు ప్రాపంచిక జీవితపు అలంకారాలు. నీ ప్రభువు దృష్టిలో ఫలితంరీత్యా ఎంతో శ్రేష్ఠమైనవి, శాశ్వతంగా ఉండేవి సత్కార్యాలు మాత్రమే. వాటి ద్వారానే మేలు ఆశించడానికి ఆస్కారముంది.**

**(అల్-కహఫ్: 46)**

## కుటుంబం : ఓ పరిచయం

అమ్మ గుర్తొచ్చినా..నాన్న గుర్తొచ్చినా.. బాల్యం గుర్తొచ్చినా.. కళ్ళు పొడిగానే ఉన్నా.. కన్నీళ్లు రాకపోయినా, హృదయం మాత్రం ద్రవించిపోతుంది. ఆ కాలం మళ్ళీ రాదేం అని మనసు ఆక్రోశిస్తుంది.- కుటుంబం అంటే జ్ఞాపకాలు!

అన్నా చెల్లెళ్ల మధ్య అల్లరి, అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధం, అక్కా చెల్లెళ్ల మధ్య స్నేహం, తల్లి దగ్గర గారాబం, తండ్రి దగ్గర గౌరవం, అన్న పట్ల అనురాగం, తమ్ముళ్ల పట్ల అనుబంధం.. ఓహ్.. కుటుంబం అంటే అపురూప భావనల సమాహారం!!

ఒంటరిగా ఉన్నప్పుడు వసంతాలు, వెన్నెల రాత్రులు కూడా ఇవ్వలేని అనుభూతులు - కబుర్లు చెప్పుకుంటూ భోంచేస్తున్న వేళ, వెన్నెల రాత్రుల్లో వినీలాకాశం క్రింద కలిసి ఆడుకుంటున్న వేళ దొరుకుతాయి. కుటుంబం అంటే వెలకట్టలేని సంతోషాల సప్త రంగుల హరివిల్లు!!

విరబూసిన మమతలకు, కలబోసిన మనసులకు, మచ్చలేని మనుషులకు అచ్చమైన ప్రతిబింబం - కుటుంబం!

తీపి తీపి దరహాసాలు, చేదు చేదు పరిహాసాలు, పులుపు పులుపు బులపాటాలు, వగరు వగరు గుణపాఠాలు - సుఖ దుఃఖాల సంగమం - కుటుంబం.!

కలల్ని కథల్ని మాటల్ని పాటల్ని రంగుల్నీ రంగవల్లులనీ, జింక పిల్లల్ని, పులి పసికూనల్ని చూసినప్పుడు ఎంత ఆనందమేస్తుందో దానికి మించిన సంతోషం తల్లి, చెల్లి, అమ్మమ్మ, నాన్నమ్మలతో గడిపినప్పుడు కలుగుతుంది - కుటుంబం అంటే ఓ ఇంద్రజాలం!

పూలలో ఉంటాయి వేల రకాలు, పక్షులలో ఉంటాయి లక్షవిధాలు. రేకులు ఉంటేనే పువ్వంటాము... రెక్కలు ఉంటేనే పక్షంటాము. అలాగే కుటుంబముంటేనే సంఘం, సమాజం అంటాము. కుటుంబం అంటేనే ప్రపంచం!!

సంక్రాంతి, రమజాన్, బక్రీద్ - పండుగ ఏదైనా .. ఒంటరిగా ఉన్నప్పుడు ఏ పండగ అయినా చిన్న సంతోషాన్ని ఇచ్చిందా? లేదు కదా, అంటే కుటుంబం అంటేనే పండగ.!

*యె ఖాందాన్ హమారా ఛూట్ గయా జబ్‌సే*

*మజా హమేఁ కిసీ తెహ్వార్ మే నహీ ఆతా*

సంతోషాన్ని రెండింతలు చేసే, బాధను సగానికి తగ్గించే దివ్య సూత్రం- కుటుంబం. చేసే చిన్న చిన్న త్యాగాలు కూడా ఇష్టంగా అనిపించే మహిమాలయం- కుటుంబం. ఒక్క మాటలో చెప్పాలంటే, కుటుంబం జీవితంలో భాగం కాదు.. కాజాలదు.. కాకూడదు. కుటుంబమే జీవితం!!

## కుటుంబం గురించి ఓ మాట

భవనానికి పునాది ఎంత ముఖ్యమో సమాజానికి కుటుంబం అంతే ముఖ్యం. వ్యక్తి వికాసంలో, ఎదుగుదలలో కుటుంబం ఎంతో ప్రముఖమైనది. కుటుంబ విస్తృత రూపమే సమాజం. కుటుంబ వ్యవస్థ ద్వారా మనిషి తన వ్యక్తిత్వాన్ని మెరుగు పరుచు కోగలుగుతాడు. మనం పెరిగిన పరిస్థితులు, మన ఆలోచనలు, మన ధర్మం- ఇస్లాం- గురించి ఎంత కష్టపడుతున్నామో- దీనికంతటికీ కుటుంబ వ్యవస్థే దోహదపడుతుంది. ఒక మనిషి ఎదుగుదలకు కుటుంబం ఎంతో సహాయ పడుతుంది. అందువల్లే ఇస్లాం కుటుంబ వ్యవస్థకు చాలా ప్రాధాన్యం ఇస్తుంది.

## కుటుంబ వ్యవస్థ

మనిషి సామాజిక జీవనానికి కుటుంబమే మూలం. పుట్టుకతో, పెళ్లితో ఆ బంధాలు ఏర్పడతాయి. కుటుంబంలో భాగమైన వ్యక్తి రకరకాల విధులు నిర్వహిస్తాడు. అందులో దైహిక, సామాజిక, ఆర్థిక, లైంగిక, విద్య, సాంస్కృతిక సంబంధమైనవి ఎన్నో ఉంటాయి.

ప్రపంచంలోని అన్ని సమాజాల్లోనూ కుటుంబ వ్యవస్థ కనిపిస్తుంది. దీని ఆరంభం ఆదిలోనే - ఆది దంపతులయిన హజ్రత్ ఆదమ్ మరియు హవ్వా (అ)లతో మొదలయింది. అందుకే కుటుంబం, వివాహం సమాంతర వ్యవస్థలని అంటారు. ప్రతి దశలోనూ కుటుంబ వ్యవస్థ కనిపిస్తుంది. మన జీవితంలో అధిక భాగం కుటుంబంతోనే గడుస్తుంది. ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ లేని సమాజం లేదు. వ్యక్తి, సమాజానికి కుటుంబం ఒక ముఖ్యమైన సాంఘిక సమూహం. ఈ ప్రపంచంలోని ప్రతీ వ్యక్తి ఏదో ఒక కుటుంబంలో భాగంగా ఉంటాడు. కుటుంబం ఒక కేంద్ర బిందువు. దీని చుట్టూనే మన మొత్తం జీవితం తిరుగుతూ ఉంటుంది. మనం మన దినచర్య కుటుంబ సభ్యులతోనే ప్రారంభిస్తాం.

## కుటుంబ, సంఘ ధర్మం ఇస్లాం

ఇస్లాం ధర్మం యొక్క సానుకూల ప్రాభవము తొలుత మీ నుండే మొదలవుతుంది. మిమ్మల్ని పుట్టించిన మీ నిజ సృష్టికర్తను మీకు పరిచయం చేసి, మీకూ- మీ ప్రభువుకి మధ్య బంధాన్ని అది బల పరుస్తుంది. మీతో మీకు ఉండాల్సిన సంబంధాన్ని చక్కబెడుతుంది. ఫలితంగా- మీలోని ప్రతిభాపాటవాలను అనునిత్యం నవీకరించుకుంటూ నిత్య చైతన్య కరదీపకలవుతారు మీరు. మీ ఆలోచనలు నిర్మాణాత్మకంగా, మీ ఆచరణలు అభివృద్ధికి బాటలు వేసేవిగా రూపాంతరం చెందుతాయి. తద్వారా మీరు మీ దేహాన్ని, మీ మేధనూ, మీ మనస్సును - వాటికి కీడు కలిగించేటటువంటి ప్రతి వస్తువు నుండి కాపాడు కున్న క్రియాశీలురుగా ఎదుగుతారు. మీలో చోటు చేసుకున్న ఈ మార్పు- మీ పరిసరాలను, మీ పరివారాన్ని ప్రభావితం చేస్తుంది. మీలో ఉన్న ఈ మేలు మీ తల్లిదండ్రులకు, మీ భార్యా పిల్లలకు, మీ బంధుమిత్రులకు, మీ స్నేహితులకు, మీ పరిచయస్తులకు, మీ ఇరుగుపొరుగు వారికీ, సామాన్య ప్రజలకు చేరి- క్షామ సమాజంగా ఉన్న వ్యవస్థను ఓ సంక్షేమ సమాజంగా మారుస్తుంది.

## కుటుంబ పరిణామ క్రమం

సాంప్రదాయిక కుటుంబ వ్యవస్థ యథావిధిగా కొనసాగుతోందా? మార్పులేమైనా చోటు చేసుకుంటున్నాయా? అనే విషయానికొస్తే.. సామాజిక శాస్త్రవేత్తల అభిభాషణ ప్రకారం నేటి కుటుంబ వ్యవస్థలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామికీకరణ, విద్యావ్యాప్తి, నగరీకరణ, వివిధ చట్టాలు, ఆర్థిక, ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల కుటుంబ వ్యవస్థలో చాలా మార్పులొస్తున్నాయి. ఇకమీదట కూడా వస్తుంటాయి.

జీవితంలో మార్పు అనేది సహజంగా జరుగుతుంది, అయితే ఈ మార్పు మనకి సంతోషం తెస్తుందా? లేదా ఇబ్బందికరం అవుతుందా? అనేదే అసలు ప్రశ్న. కొద్దిమంది అసలు మార్పుని ఇష్టపడరు. వారు ప్రస్తుతం వున్న స్థితిలోనే అంతా వుండాలని కోరుకుంటారు. వచ్చే మార్పు తమను ఇబ్బంది పెడుతుందేమో అని భయపడతారు. వారికి ఒక ఇల్లు మారాలన్నా భయం. ఉద్యోగం మారాలన్నా భయం. కొత్త వ్యక్తులతో పరిచయం చేసుకోవాలన్నా భయం. ఈ భయాల కారణంగా ఎలాంటి మార్పు

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

లేకుండా, వారికి ఎప్పుడూ తెలిసిన పరిస్థితులలోనే వుండాలని కోరుకుంటారు. కాని అది సాధ్యం కాదు కదా! కాలం మారుతూ వుంటుంది. మారుతున్న కాలంతోపాటు మనం అభివృద్ధి చెందుతూ మారుతూ వుండాలి. అయితే మార్పు అనేది మంచి చేసేదిగా ఉండాలే గానీ, చెడు, కీడు, పాడు చేసేదిగా ఉండకూడదు. నేడు మానవ సమాజంలో చోటు చేసుకుంటున్న మార్పుల్లో అధిక శాతం కీడును కలిగించేవే అయి ఉండటం కడు శోచనీయం! అలా కుటుంబ వ్యవస్థను చడి చప్పుడు లేకుండా చాప క్రింద నీరులా చేరి పాడు చేస్తున్నాయి కొన్ని వికారాలు. అలాంటి కొన్ని వికారాల్ని ఇప్పుడు తెలుసుకుందాం!

### 1) వివాహ విముఖత

వినాశకర ఆలోచన వివాహమే వద్దు అన్నది. ఆర్థిక స్వేచ్ఛ గల స్త్రీకి- ఆర్థికంగా పురుషునిపై ఆధారపడే పరిస్థితి లేనప్పుడు సహజంగానే ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది- తాను స్వయంగా సంపాదించగలుగుతున్నప్పుడు భర్తకు ఎందుకు లోబడి ఉండాలి? భర్తకు సేవలు ఎందుకు చేయాలి? సంసార బాధ్యతలు ఎందుకు మోయాలి? పెళ్లి చేసుకుని, భర్తకు సేవలు చేసే బాదరబందీలు ఎందుకు కొని తెచ్చుకోవాలి? అనే భావన నానాటికీ బలపడుతుంది. జీవితం అనేది అనుభవించటానికే ఉందిగాని, బరువులు మీద వేసుకోవటానికి కాదు. అందుకే చాలా మంది స్త్రీలు తమ మనుగడ కోసం మగవాళ్ళ అండదండలు అవసరం లేదన్న నిర్ణయానికి వచ్చారు, వస్తున్నారు. అలాగే కొందరు పురుషుల్లో సయితం వివాహం అంటే వెగటు సగటుగా కనబడుతూనే ఉంది. మగ ఆడ కలిసుండాలనుంటే దానికి పెళ్లే కావాలా? నుండి మొదలయి చర్మ సుఖం కోసం పురుషుడే కావాలా? స్త్రీయే కావాలా? అన్న దిగజారుడుతనం వైపు సాగుతోంది.

### 2) సహజీవనం - OYO దుష్కృతి

అసహజమైన జీవన విధానానికి పెట్టుకున్న పేరు సహజీవనం. నవతరంలో వైవాహిక వ్యవస్థపై నమ్మకం సడలిపోతోంది. పెళ్లి చేసుకోకుండానే అబ్బాయి- అమ్మాయి లేదా స్త్రీ-పురుషుడు సహజీవనం సాగిస్తున్నారు. పిల్లల్ని కంటున్నారు. ప్రతి రెండు మూడేళ్లకోసారి తమ జీవిత భాగస్వామిని కర్చీఫ్ మాదిరిగా మార్చేస్తున్నారు. ముసలి తల్లి దండ్రులు సోషల్ సెక్యూరిటీ (అంటే పెన్షన్)పై బ్రతుకుబండి లాగుతూ చచ్చిపోతున్నారు. దయా దాక్షిణ్యాలు లేని సంతానం కనీసం వారి అంత్యక్రియలకు కూడా రావడం లేదు.. అందం, ఐశ్వర్యం, ధనం, బలం ఉందని విర్రవీగ కూడదు. కుటుంబ విలువల్ని కాలరాయకూడదు.

*మిలే ఉరూజ్ తో మగ్రూర్ కభీ మత్ హెూనా / బులందియో కే సభీ రాస్తే ఢలాన్ సే హైఁ*

### 3) స్వలింగ సంపర్కం

స్వలింగ సంపర్కం వల్ల కుటుంబానికి జరిగే నష్టం చెప్పలేనిది. అందుకే ఇస్లాం ఈ వినాశకర చేష్టను తీవ్రంగా ఖండించింది. అనంత కరుణామయుడయిన అల్లాహ్ ప్రవక్త లూత్ (అ) కాలం నాటి సదూమ్ జాతి ప్రజలను వారి ఈ దుశ్చర్య కారణంగా కఠినాతికఠినంగా శిక్షించాడు.

> **ఆ తరువాత మా ఆజ్ఞ వచ్చేసింది. అప్పుడు మేమా పట్టణాన్ని అమాంతం కుదిపేసి తల్లక్రిందులు చేశాం. ఆపై మండుతున్న మట్టిరాళ్ళు దాని మీద ఉధృతంగా కురిపించాము. అందులోని ప్రతి రాయి నీ ప్రభువు దగ్గర గుర్తు వేయబడింది. ఇలాంటి శిక్ష దుర్మార్గ వైఖరి అవలంబించినవారికి ఎంతో దూరంలో లేదు. (హూద్: 82-83)**

ఈ రోజు పరిస్థితి ఎలా తయారైందంటే, వ్యక్తిగత స్వేచ్ఛ పేరుతో - నైతిక ప్రమాణాలకు తిలోదకాలిస్తున్నారు. ఇక మనం వారు తానా అంటే తందానా అనం కదా! అయినా కొంతమంది మార్పును స్వాగతించాలి, ఎదుటి వాళ్ళ అభిప్రాయాన్ని గౌరవించాలి అని అంటూ నీతిబోధ చేసే ప్రయత్నం చేస్తుంటారు.... ఇష్టా ఇష్టాలు పక్కన పెడితే మనుషులకంటూ కొన్ని ప్రమాణాలు ఉన్నాయి. వాటిని సృష్టికర్త ముందే ఏర్పాటు చేశాడు. దానికి విరుద్ధంగా చేసే పని దేనినీ మనం ప్రోత్సహించ కూడదు, దానితో ఏకీభవించకూడదు. పైన పేర్కొన్న మూడు పద్ధతులూ కుటుంబ వ్యవస్థ పాలిట గొడ్డలిపెట్టు వంటివే అనడంలో ఎలాంటి సందేహం లేదు.

(మిగతా వచ్చేవారం)

## క్షంతవ్యులం

గీటురాయి రమజాన్ ప్రత్యేక సంచిక (28-2-2025) 24వ పేజీలో జావీద్ అహ్మద్ గామిదీ పుస్తకం 'మీజాన్' గురించి 'ప్రకటన' వచ్చింది. జావీద్ అహ్మద్ గామిదీ విచారధారతో నూటికి నూరు శాతం మేము విభేదిస్తున్నాము, ఖండిస్తున్నాము కూడా. పొరపాటున ప్రకటన వచ్చేసింది. దానికి మేము క్షంతవ్యులం. పాఠకులు సహృదయంతో అర్థం చేసుకోవలసిందిగా మనవి. **- సంపాదక వర్గం**

# జీవితానికి దారి దీపం

- అర్షియా

అల్లాహ్ ద్వారా మానవాళి కోసం అవతరించిన దివ్య గ్రంథం.. 'ఖుర్ఆన్'. ప్రపంచంలో అత్యధికులు పఠించే గ్రంథం ఇదే. ఇహ, పరాల్లో జీవిత సాఫల్యతకు దారి చూపే నైతిక సూక్తుల భాండాగారం ఈ గ్రంథ రాజం. ఖుర్ఆన్‌లోని విషయాలు సరళంగా అందరికీ అర్థమయ్యే రీతిలో ఉంటాయి. మనుషులు ఎలా జీవించాలి? స్త్రీ, పురుషులకు ఉండే వేర్వేరు బాధ్యతలేమిటి? మానవత్వానికి అర్థం ఏమిటి? ధైర్యానికి నిర్వచనం ఏమిటి? వివాహ ధర్మాలేమిటి.. సమాజంలో పౌరుడి బాధ్యతలేమిటి.. ఇలా మనిషి జీవితానికి సంబంధించిన సమస్త అంశాలకు మార్గ నిర్దేశనం చేసే అంశాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా ఆ గ్రంథంలోని ముఖ్యాంశాలను మననం చేసుకుని మనసా, వాచా, కర్మణా ఆచరిద్దాం.

## మన నైతికత ఇలా ఉండాలి

ఎప్పుడూ సత్యాన్నే పలకాలి. ఎక్కువ మంది చెప్పిందే సత్యమని భ్రమ పడకుండా ప్రవక్తలు చెప్పిన సత్యాలనే నిజమని నమ్మాలి. ఎదుటి వారికి నీతులు బోధించే ముందు మనం వాటిని ఆచరించాలి. ఇచ్చిన మాట మీద నిలబడాలి. ఇతరులు మన మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకూడదు. ఎవరినీ గుడ్డిగా అనుసరించ కూడదు. పాపపు పనులు, దౌర్జన్యాలు చేసే వారికి సహకరించ కూడదు. మనం పెడదారి పడితే కోరి కీడు కొని తెచ్చుకుంటామని గుర్తుంచుకోవాలి.

## సమాజంతో ఇలా మెలగాలి

ఇతరులతో మృదువుగా మాట్లాడాలి. పరిచయస్తులతో ఆప్యాయంగా మెలగాలి. ఇతరుల సంపదను అయాచితంగా ఆశించకూడదు. ఒకరి ఉన్నతిని చూసి అసూయ చెందకూడదు. వీలైతే మంచి పనుల్లో ఇతరులకు తోడ్పాటు అందించాలి. ఇతరుల రహస్యాలు వినకూడదు. ఒకరి గురించి ఇంకొకరికి చాడీలు చెప్పకూడదు. ఇతరుల తగాదాలకు తీర్పు చెప్పాల్సి వచ్చినప్పుడు న్యాయం ఎటువైపు ఉందో వారికి అనుగుణంగా తీర్పునివ్వాలి. పనికిమాలిన విషయాల గురించి, అనవసరమైన విషయాల గురించి పట్టించుకోకూడదు. ఇతరుల ఇండ్లలోకి అనుమతి లేకుండా ప్రవేశించకూడదు. ఎవరినీ అతిగా అనుమానించకూడదు. నిస్సహాయులను, నిరుపేదలను ఎగతాళి చేయకూడదు. ఇతర మతాల విశ్వాసాలనూ గౌరవించాలి. ఇతర మతస్తులతో సామరస్యంగా మెలగాలి. మన ఇంట్లో అయినా, ఇతరుల ఇండ్లలోనైనా అన్న పానీయాలను వ్యర్థం చేయకుండా తగినంత మాత్రమే తీసుకోవాలి. మన జీవనానికి ఆధారమైన భూగోళం మీద గౌరవం చూపుతూ నేల మీద వినమ్రంగా నడవాలి.

## సేవా కార్యక్రమాల గురించి

అనాథలను రక్షించి వారి జీవనానికి చేతనైన సాయం చేయాలి. ఏటా రమజాన్ మాసంలో మన సంపదలో రెండున్నర శాతం దాన ధర్మాలకు వినియోగించాలి. సంవత్సరం పొడవునా ఆకలి గొన్న నిరు పేదలకు అన్నదానం చేయాలి.

## దైవారాధన ఇలా...

అల్లాహ్ ప్రసన్నత కోసం పోరాటం చేయాలి తప్ప అల్ప విషయాల కోసం కాదు. నిరుపేదలకు సాయం చేయడం కూడా దైవారాధనే అని తెలుసుకోవాలి. దైవ ప్రవక్తలపై విశ్వాసం ఉంచాలి. అల్లాహ్ కారుణ్యం ఆలస్యమైనా నిరాశ చెందకుండా నిరీక్షిస్తూ ఉండాలి. సన్యాసం జోలికి పోకుండా సంసార బాధ్యతలను నిర్వహిస్తూనే దైవాన్ని ప్రార్థించాలి. పరిశుద్ధతను పాటిస్తూ ఖుర్ఆన్ పఠనం చేయాలి. తరచూ సంప్రదాయ వస్త్రధారణలో మసీదుకు వెళ్లి నమాజ్ చేయాలి. సృష్టి ధర్మం గురించి చింతన చేయాలి. మసీదులకు వెళ్లే వారికి అడ్డు పడకుండా దారి ఇవ్వాలి.

## వివాహ, కుటుంబ ధర్మాలు

స్వలింగ సంపర్కానికి, వ్యభిచారానికి స్త్రీ, పురుషులిద్దరూ దూరంగా ఉండాలి. పురుషులు తమ తల్లులు, కుమార్తెలు, అక్కా చెల్లెళ్ళు, మేనత్తలు, తల్లి సోదరీమణులు (పిన్నమ్మ పెద్దమ్మలు), అన్నదమ్ముల కుమార్తెలు, అక్కా చెల్లెళ్ళ కూతుళ్ళు (మేనకోడళ్ళు), పాలిచ్చిన తల్లులు, పాల వరుస ద్వారా అక్కా చెల్లెళ్ళు అయినవారు, భార్యల తల్లులను (అత్తలు) వివాహం చేసుకోవడం నిషేధం. ఆశుద్ధావస్థలో భార్యలతో సమాగమం జరపకూడదు. మహిళలు భర్తకు తప్ప పర పురుషుల ముందు తమ సింగారాలను, అందాన్ని ప్రదర్శించకూడదు. కుటుంబ పెద్ద చనిపోతే ఆస్తులను కుటుంబ సభ్యులందరికి షరీఅత్ ప్రకారం పంచాలి. మహిళలకు ఆస్తి హక్కు ఉందని గుర్తించాలి. పురుషులు పిసినారితనం చూపకుండా కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలి. తల్లిదండ్రులతో గౌరవంగా మెలగాలి. అతిథులను ఆదరించి తగిన మర్యాదలు చేయాలి. తల్లులైన మహిళలు తమ పిల్లలకు రెండు సంవత్సరాల వరకు పాలు పట్టాలి. మనకు దారిద్ర్యం ఉందని, భవిష్యత్తుల్లో సంభవిస్తుందని భయపడి సంతానాన్ని చంపకూడదు.

## పౌరులుగా పాటించాల్సిన విధులు

లంచగొండితనానికి పాల్పడకూడదు. శత్రువులతో చేతులు కలిపి మనం ఉంటున్న రాజ్యానికి ద్రోహం చేయకూడదు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదు, వాటిని అమ్మకూడదు. జూదానికి దూరంగా ఉండాలి. వ్యాపారం చేస్తున్నట్టయితే కొలతలు, తూనికలలో మోసాలకు పాల్పడకూడదు. నిస్సహాయులు ఎవరైనా శరణు కోరితే, వారికి కొంత కాలం మన ఇంట్లో ఆశ్రయమివ్వాలి. ఇతరులతో పని చేయించాల్సి వచ్చినప్పుడు వారి సామర్థ్యానికి మించి భారం వేయకూడదు. ❖

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

37 ఆయత్‌లు

# 45. అల్ జాసియ

మక్కా అవతరణ

16 – 20 ఇతఃపూర్వం మేము బనీ ఇస్రాయీల్‌కు గ్రంథాన్ని, ఆదేశాన్ని,[20] దైవదౌత్యాన్నీ అనుగ్రహించాము. మేము వారికి అత్యుత్తమ జీవికను ప్రసాదించాము, ప్రపంచ ప్రజలందరిపైనా వారికి ఘనతను ఇచ్చాము,[21] ధర్మం విషయంలో అతి స్పష్టమయిన మార్గబోధనలనిచ్చాము. ఆ తరువాత వారి మధ్య విభేదం పొడసూపినది (ఎరుక లేకపోవడం చేత కాదు, పైగా) జ్ఞానం వారివద్దకు వచ్చేసిన తరువాతనే. దానికి కారణం, వారు ఒకరిపై నొకరు అత్యాచారం జరుపుకోవాలని కోరుకున్నారు.[22] వారు విభేదించుకుంటూ ఉన్న వ్యవహారాలకు అల్లాహ్ ప్రళయదినాన తీర్పు చేసివేస్తాడు. ఆ తరువాత, ప్రవక్తా మేము నిన్ను ధర్మం విషయంలో ఒక అతి స్పష్టమయిన రాచబాట (షరీఅత్) పైన సుస్థిరపరిచాము.[23] కనుక నీవు మటుకు దానినే అనుసరించు, జ్ఞానం లేనివారి మనోకాంక్షలను అనుసరించకు. అల్లాహ్‌కు ప్రతిగా వారు నీకు ఏ విధంగానూ ఉపయోగపడరు.[24] దుర్మార్గులు ఒకరికొకరు సన్నిహితులు, నిష్ఠాపరుల సన్నిహితుడు అల్లాహ్ మాత్రమే. ఇవి జనులెల్లరికీ జ్ఞానకాంతులు, మరి మార్గబోధన, కారుణ్యం, దృఢంగా నమ్మేటటువంటి జనుల కొరకు.[25]

21 – 22 ఏమిటీ,[26] ఎవరయితే చెడులకు పాల్పడ్డారో వారు, మేము వారినీ మరి విశ్వసించి సదాచరణ చేసే వారినీ ఒకేలా చేసి వారి జనన మరణాలు సమానమయ్యేలా చేసివేస్తామని అనుకుని ఉన్నారా? చాలా చెడ్డ తీర్పులు వీరు చేస్తూ ఉన్నవి.

20. ఆదేశం అంటే ఉద్దేశ్యం మూడు విషయాలు. ఒకటి గ్రంథ జ్ఞానం, అవగాహనా శక్తి, ధర్మంలో తెలివితేటలు. రెండు, గ్రంథం ఉద్దేశానికనుగుణంగా పనిచేసే విజ్ఞత, వివేకం. మూడు, వ్యవహారాలలో నిర్ణయాలు చేసే సామర్థ్యం.

21. అంటే భావం చిరకాలానికి గాను వారికి ప్రపంచ ప్రజలందరిపైనా ఘనతను ప్రసాదించాడని అర్థం కాదు, దీనికి సరయిన భావం, ఆ కాలంలోని ప్రపంచ ప్రజలందరిలో బనీ ఇస్రాయీల్‌ని ఎన్నుకుని, దైవగ్రంథవహులుగా, దైవభక్తికి ధ్వజవాహకులుగా లేచి నిలబడాలని, ఆ సేవకు అల్లాహ్ వారిని నియమించాడని అర్థం.

22. వివరణకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.1– అల్ బకర : పాద సూచి 23, ఆలి ఇమ్రాన్ : పాద సూచికలు 17, 18; సం.7– అష్ షూరా: పాద సూచికలు 22, 23.

23. భావమేమిటంటే, బనీ ఇస్రాయీల్‌కు మొదట అప్పజెప్పిన పని ఇప్పుడు మీకు అప్పజెప్పడం జరిగింది. వారు జ్ఞానం పొందిన తరువాత కూడా తమ మనోకాంక్షల, స్వార్థాల కారణంగా ధర్మంలో విభేదాలు సృష్టించారు, పరస్పరం వర్గాలు సృష్టించుకున్నారు. ఫలితంగా వారు ప్రపంచ ప్రజల్ని దైవమార్గం వైపునకు పిలువ గలిగే యోగ్యులు కాలేకపోయారు. ఇప్పుడు అదే ధర్మానికి చెందిన ప్రస్ఫుటమయిన రాజమార్గాన మిమ్మల్ని నిలబెట్టడం జరిగింది. – బనీ ఇస్రాయీల్ నిర్వర్తించే యోగ్యత కోల్పోయి వదిలేసిన సేవను నిర్వర్తించాలని. (మరిన్ని వివరాలకై చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం.7, అష్ షూరా: ఆయత్‌లు 13–15, పాద సూచికలు 20–26తో పాటు).

24. అంటే, నీవు వీరిని సంతుష్టపరచడానికి అల్లాహ్ ధర్మంలో ఏ విధమయిన మార్పులూ చేర్పులయినా చేసినట్లయితే అల్లాహ్ పట్టు నుండి వారు నిన్ను కాపాడలేరు.

25. భావమేమిటంటే, ఈ గ్రంథం, ఈ షరీఅత్ ప్రపంచంలోని మానవులందరికీ, సత్యాసత్యాల మధ్య వ్యత్యాసాన్ని విడమర్చి తెలిపే వెలుగును అందజేస్తాయి. అయితే దీని సత్యతను నమ్మే వ్యక్తులే దీనిద్వారా సన్మార్గబోధన పొందగలరు. ఇటువంటి వారి విషయంలోనే ఇది కారుణ్యం కాగలదు.

26. దేవుని ఏకత్వం వైపునకు పిలుపునిచ్చిన తరువాత ఇప్పుడు ఇక్కడ పరలోకం పట్ల చర్చ మొదలవుతోంది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా(ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## కల్లోల జనకులు

**235)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : ప్రవక్త మహనీయుల(సఅసమ్) కాలంలో ముసైలిమా అబద్ధాగ్రేసరుడు వచ్చి 'ముహమ్మద్ గనక నన్ను, తన తదనంతరం ప్రతినిధిగా చేసే మాటైతే నేను ఆయనకు విధేయత చూపు తాన'ని చెప్పాడు. అతని వెంట అతని జాతి (బనూ హనీఫా)కి చెందిన ఒక పెద్ద సైనిక దళం కూడా ఉంది. దైవప్రవక్త(స) అతనికి హితబోధ చేసేందుకు, అతని వద్దకు వెళ్ళారు. ఆయన(స) వెంట సాబిత్ బిన్ ఖైస్ బిన్ షమ్మాస్(రజి) కూడా ఉన్నారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) చేతిలో ఒక బెత్తం ఉంది. ముసైలిమా కిజ్జాబ్ తన సైనికులతో విడిది చేసి ఉన్న స్థలానికి ఆయన(స) వెళ్ళి, "ఒకవేళ నీవు నా నుండి ఈ బెత్తం అడిగినా అది నీకు ఇవ్వబడదు. అల్లాహ్ నీ గురించి చేసిన నిర్ణయాన్ని దాటి నీవు ముందుకు పోలేవు. నీవు గనక నా విధేయత పట్ల విముఖత చూపినట్లయితే అల్లాహ్ నిన్ను అంతమొందిస్తాడు. నాకు కలలో చూపించబడిన వాడివి బహుశా నువ్వే అయి ఉండవచ్చు. ఇక నీ ప్రశ్నలకు సమాధానం నా తరపున సాబిత్ బిన్ ఖైస్(రజి) ఇస్తారు"– ఇలా చెప్పిన మీదట దైవప్రవక్త(స) తిరిగి వచ్చేశారు.

ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: "కలలో ఏ వ్యక్తి పర్యవసానం నాకు చూపించబడిందో, ఆ వ్యక్తి బహుశా నువ్వేనని నా అనుమానం" అన్న దైవప్రవక్త (స) పలుకుల్లోని నేపథ్యం ఏమిటని నేను అడిగితే అబూ హురైరా(రజి) నాకు ఇలా వివరించారు: "దైవప్రవక్త(స) నాతో ఇలా అన్నారు– నేను నిద్రలో ఉండగా నా చేతులకు రెండు బంగారు మురుగులు ఉన్నట్లు చూశాను. ఇది చూసి నాకెంతో దుఃఖం కలిగింది. నిద్రలోనే నాకు దివ్యావిష్కృతి అందింది– 'ఆ మురుగులను ఊదేసేయ్' అని నాకు వహీ ద్వారా సూచించబడింది. నేను వాటిపై ఊదగానే అవి ఎగిరిపోయాయి. నా తదనంతరం ఇద్దరు అబద్ధాగ్రేసరులు పొడసూపుతారని నేను ఈ కలకు భావాన్వయం చేసుకున్నాను. ఆ ఇద్దరిలో ఒకడు అస్వద్ అన్‌సీ, రెండవవాడు ముసైలిమా కిజ్జాబ్." ఆ ఇద్దరినీ అల్లాహ్ గాలిలో పొట్టు ఎగిరినట్లుగానే తుదముట్టించాడు.[1]

**236)** మహాప్రవక్త(సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "స్వప్నంలో నా దగ్గరకు భువిలోని నిధులు తీసుకురాబడ్డాయి. నా చేతుల్లో రెండు బంగారు మురుగులు ఉంచబడ్డాయి. అది నాకెంతో బాధాకరం అయింది. ఆ తర్వాత వాటిని ఊదేసెయ్యి అని నాకు వహీ పంపబడింది. నేను ఊదగానే అవి ఎగిరిపోయాయి. నేను దాని భావార్థం గురించి ఆలోచిస్తే నేను ఇద్దరు అబద్ధీకుల మధ్యన ఉన్నట్లు గ్రహించాను. ఆ ఇద్దరిలో ఒకడు సనా వాసి (అస్వద్ అన్సీ), రెండవవాడు యమామా నివాసి (ముసైలిమా కిజ్జాబ్).

235-1. అస్వద్ అన్‌సీ దైవప్రవక్త(స) హయాంలోనే సంహరించబడ్డాడు. ముసైలిమా కిజ్జాబ్ మొదటి ఖలీఫా అబూబక్ర్(రజి) కాలంలో వధించబడ్డాడు. ఎట్టకేలకు సత్యమే జయిస్తుంది. అసత్యం ఎంత ఆర్భాటం చేసినా అది సమసిపోవలసిందే. ఈనాడు అస్వద్‌ను, ముసైలిమాను అనుసరించేవాడు ఒక్కడూ లేడు. మహనీయ ముహమ్మద్ (స)ను అనుసరించేవారు మాత్రం ప్రళయం వరకూ ఉంటారు.

★★★




# అమెరికా ఆర్థిక సంక్షోభం ఒక గుణపాఠం

రెండవ భాగము

అనువాదం - కె.ఎం.ఎ. సుబ్‌హాన్

**(సయ్యద్ సాదతుల్లా హుసైనీ పుస్తకం "ఇఖామతె దీన్ కీ షాహ్‌రాహ్" నుంచి....)**

**(గత సంచిక తరువాయి)**

ఈ విధంగా పరమపావనుడైన అల్లాహ్ ఇస్లాంకు ఒక ఉత్తమ శక్తిమంతమైన సైద్ధాంతిక స్థాయిని అనుగ్రహించాడు. కొద్దిపాటి శ్రమ, పరిశ్రమ చేస్తే ఇస్లాంను ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థగా, ఆలోచనగా ప్రజల ముందు ప్రతిపాదించవచ్చు. ప్రస్తుతం వాల్‌స్ట్రీట్ మేధావులందరూ పెట్టుబడిదారీ వ్యవస్థతో విసుగుచెంది ఉన్నారు. అయితే పరిష్కారం ఏమిటి? ఆ పరిష్కారం వారి వద్దలేదు. వారు చేసిన తీర్మానాలు మూల్యాంకనాలు అన్నీ పరిశీలించి చూడండి. వాటిలో ప్రస్తుత వ్యవస్థపట్ల వ్యతిరేకత, నిరాశ ఉంది. కాని, ప్రత్యామ్నాయం వాటిలో కనపడదు. ఫైనాన్షియల్ టైమ్స్ చీఫ్ ఎడిటర్ మార్టిన్ ఓల్ఫ్ ఈ ఆర్థిక మాంద్యానికి పురోహితునిగా భావించబడతాడు. అతను వాల్‌స్ట్రీట్ చర్చలను సమీక్షిస్తూ చాలా నిజాలు రాశాడు. అతని ప్రకారం వీరు జరిపే చర్చలు విజయవంతం కావడానికి రెండు షరతులు ఉండాలి. ఒకటి, ఆ వ్యవస్థపై ఆధారపడిన ఒక సమాజం అభివృద్ధి చెందాలి. రెండవది, పెట్టుబడిదారి వ్యవస్థకు, సామ్యవాద వ్యవస్థకు భిన్నమైన ప్రత్యామ్నాయ వ్యవస్థగా ఉండాలి. (Martin wolf - The Big question raised by.... in Financial Times - October 28, 2011) ప్రస్తుతం ఉనికిలోకి వచ్చిన పై రెండు వ్యవస్థలూ పనికిరానివిగా చతికిలపడిపోయాయి. గార్డన్ బ్రౌన్ ఒక నూతన విధానపు(Pattron)అన్వేషణలో ఉన్నాడు. అయితే ఈ నూతన విధానపు పునాదులు ఏవి? అవి తనకూ తెలియదని ఆయన స్పష్టం చేశాడు. ఇతరులు తనకు సలహాలివ్వమని అభ్యర్థిస్తున్నాడు కూడానూ. బర్సల్స్‌లో యూరోపియన్ యూనియన్‌కు చెందిన బడాబడా పెట్టుబడిదారీల సమావేశం జరిగింది. అందులో వారి సభా ముగింపు నోట్‌లో మనకు ఇటువంటి మాంద్యం, సంక్షోభాల నుండి రక్షింపచేసే ఐడియాల అవసరం ఉంది. అయితే ఆ ప్రత్యామ్నాయ ఐడియా ఏమిటో వారికి కూడా తెలియదు. ఈ నేపథ్యంలో ఇస్లాం తప్ప మరేది ప్రత్యామ్నాయంగా ఉండగలదు? ఇస్లాంను ప్రతిపాదించడానికి ఇది ఒక అద్భుత అవకాశం కాదా?

ఇస్లాం కేవలం సిద్ధాంతం– దృక్పథం–భావన–తన సూత్ర బద్ధతల ద్వారా మాత్రమే తన ఆధిక్యతను స్థాపించలేదు. అది అనుభవం, ప్రయోగం, ఆచరణ ద్వారా కూడా ఆధిక్యతను రుజువు చేసుకుంది. పశ్చిమ దేశాల ఆర్థిక వ్యవస్థలు, వారి బ్యాంకులు ఆర్థిక సంక్షోభంలో కూరుకొనిపోయి విలవిల్లాడుతూ ఉన్న సమయంలోనే ఇస్లాం బ్యాంకింగ్ వ్యవస్థ ఈ సంక్షోభం నుండి తన్ను తాను కాపాడుకోవటమే కాదు, అద్భుతమైన అభివృద్ధిని సాధించింది. అనేక మంది ఆర్థిక నిపుణులు ఈ అద్భుతాన్ని వీక్షించారు. దానిని నోట్ చేశారు. ఇంటర్ నేషనల్ ఫైనాన్షియల్ సర్వీస్ సొసైటీ – లండన్ రిపోర్టు

ప్రకారం టర్కీ బ్యాంకుల స్థితి చాలా మెరుగ్గానూ, ధృఢంగానూ వుంది.

In many ways Turkey has weathered the credit crunch better than other energing economies. Party thanks to tough regulation, not a single Turkish bank has gone under. That is also because, unlike many western banks, they have few toxic assets and limited mortgage exposure. So the government has not had to divert public money in to rescuing banks reserving thus the public debt in a low level.

అంటే, టర్కీలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థికస్థితి నగదు లావాదేవీల విషయంలో విజయవంతంగా, సమర్ధవంతంగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. టర్కీ వద్ద నష్టదాయకమైన ఆర్థిక పునాదులు లేవు అని అర్ధమవుతుంది. ఈ బలహీనత వల్ల పశ్చిమ దేశాల బ్యాంకులు దివాలా తీశాయి. (Turkey's Fragile economy ; in the economist ; June - 16 -2009)

కేవలం టర్కీ బ్యాంకులే ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తలేదు. ఎర్దుగాన్ నాయకత్వంలోని రాజకీయ వ్యవస్థ, అంతర్జాతీయ పాలసీలలో ఏ స్థాయిలో ఇస్లామీయ విలువలు ఉన్నాయో, అంత కన్నా మించి ఇస్లాం ప్రభావ ఫలితాలు, దాని వాణిజ్యం మరియు దాని ఆర్థిక వ్యవస్థలో ప్రస్ఫుటమయ్యాయి. నేను ఈ విషయమై కొంత వివరణాత్మక వెలుగును వేయదలిచాను.

2001లో ఎర్దుగాన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి టర్కీ ఆర్థిక స్థితి అత్యంత దయనీయంగా ఉండింది. దాని ఆర్థిక సూచీ సగటున 40 నుండి 60 శాతంగా ఉంటుంది. IMF కఠిన నిబంధనలకు తల ఒగ్గి 45 బిలియన్ డాలర్ల బైల్ అవుట్ ప్యాకేజీ టర్కి తీసుకోవలసి వచ్చింది. ఇప్పుడు పదేళ్ళ తరువాత టర్కి ఆర్థిక స్థితి పూర్తిగా మారిపోయింది. నేడు టర్కీ యూరప్‌లో శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగల దేశంగా నిలిచి ఉంది. ఈ ఏడాది మొదటిపాదంలో టర్కీ ఆర్థిక సూచి ప్రపంచంలోని అన్ని దేశాల కంటె అధికంగా నిలిచింది. చైనా కంటె కూడా అధికస్థాయిలో ఉండింది. టర్కీ ఇప్పుడు గ్లాస్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ప్రపంచంలో రెండవ స్థానంలో ఉంది. ఎలక్ట్రానిక్ వస్తువులు, మోటార్ వాహనాల ఉత్పత్తి, నిర్మాణ సామగ్రి తయారీలలో ఉత్తమ స్థాయి సాధించింది. మిడిల్ ఈస్ట్ నుండి సెంట్రల్ ఏషియా, ఆఫ్రికా, ఇంకా సౌత్ ఈస్ట్ ఏషియా ఒక పెద్ద భూభాగంపై టర్కీ కంపెనీలు ఆవరించి ఉన్నాయి. తూర్పు యూరప్, గత సోవియట్ యూనియన్‌లోని అనేక దేశాల కోసం టర్కీ అంతర్జాతీయ పెట్టుబడులు సమకూర్చగలుగుతుంది. ఈ ఆర్థిక పరుగును గమనించిన ఆర్థిక నిపుణులు, టర్కీ మరో ఇరవై ఏండ్లలో ప్రపంచంలో ఆర్థికంగా అత్యంత శక్తిమంతమైన దేశంగా మారుతుం దని, భవిష్యవాణులు వినిపిస్తున్నారు.

ఈ అద్భుతమైన, శక్తివంతమైన ఆర్థిక విప్లవం ఎలా సంభవ మయ్యింది? టర్కీలో ఇప్పటికీ సంపూర్ణ ఇస్లామీయ వ్యవస్థ స్థాపించ బడలేదు. అయితే అక్కడి వాణిజ్య – వ్యాపార వేత్తలలో ఇస్లామీయ విలువల పట్ల అమితమైన నిష్ఠాత్మక ఆచరణ ఉంది. ఆర్థిక నిపుణులు ఈ అద్భుతమైన విషయాన్ని ముక్త కంఠంతో కొనియాడుతున్నారు. ఈ ఆర్థిక అభివృద్ధి వెనుక పని చేసిన విలువలను ప్రశంసిస్తున్నారు. అక్కడి సెక్యులర్ ప్రసార సాధనాలు ఈ అద్భుతాన్ని Yesil Sermaye లేక Green Capital అని ప్రశంసలు కురిపిస్తున్నారు.

ఈ ఆచరణను వ్యాపార పత్రికలు (Business Magazines) అనే పేరును ప్రదానం చేశాయి. (Ziya Onis and Fikret Senses ; Turkey and the Global economy ; Routledge, New york - 2009)

దివంగత అర్బకాన్ తన పదవీకాలంలో టర్కీలో సెక్యులర్ భావనల ఉధృతికి అడ్డుకట్ట వేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఇస్లాం సమ న్యాయ ఆర్థిక పాలసీలను ప్రారంభించారు. పేద ప్రజలు నివసించే గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల అభివృద్ధి కోసం ఒక ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ ప్రణాళికలను వ్యాపార వాణిజ్యాల ద్వారా ముందుకు సాగించే కృషి చేశారు. ఈ వ్యాపారవేత్తలు ఆచరణాత్మక ముస్లింలుగా ఉండేవారు. వీరు వడ్డీ వ్యవస్థను తీవ్రంగా అసహ్యించు కునేవారు. వీరిలో కొన్ని ఆధ్యాత్మిక కుటుంబాలు ఉండగా మరికొన్ని సేవా సంస్థలూ ఉండేవి. వీరు తమ దాతృత్వాన్ని వ్యాపారంగా మలిచారు. సదరు సంపదకు పెట్టుబడి రూపం కల్పించారు. వీరు ఎంత శీఘ్రంగా అభివృద్ధి సాధించారంటే ఈ ఇస్తాంబుల్ టైగర్లు ప్రపంచవ్యాపిత వ్యాపార మ్యాగజైన్లలో, చర్చనీయాంశమయ్యారు. సక్సెక్‌కు ఉదాహరణలుగా నిలిచారు. 'కోంబిసాన్ హోల్డింగ్స్' – ఇది పేద ప్రజల పొదుపు ధనం పెట్టుబడిగా ప్రారంభించిన ప్రణాళిక. ప్రస్తుతం పన్నెండేళ్ళ తరువాత ఈ ప్రణాళిక ఎన్నో బిలియన్ డాలర్ల సంస్థగా ఎదిగి ఉంది. దీని పర్యవేక్షణలో యాభై కంటె అధిక ఉత్పత్తి కర్మాగారాలు, కంపెనీలు నేడు పని చేస్తున్నాయి. ఈ కంపెనీలు కార్ల నుండి పెద్ద పెద్ద ఓడల వరకు, టెక్స్‌టైల్స్ ఉత్పత్తులు చేస్తూ, ప్రపంచంలోని 22 దేశాలలో తమ షాపింగ్ మాల్స్ కలిగి ఉన్నాయి. అతి పెద్ద వ్యాపార రంగంలోనూ ఈ కంపెనీలు నేడు చోటు సంపాదించి ఉన్నాయి.

అయితే నేడు ఈ Capital పెట్టుబడుల శక్తిమంత పరుగును నిరోధించేందుకు టర్కీ సైన్యం, సెక్యులర్ గౌరవనీయులు, తీవ్రంగా కృషి చేస్తున్నారు. అంతర్జాతీయ పెట్టుబడిదారుల ఒక పెద్ద

సమూహం వీరితో చేయి కలిపి కుట్రలు సాగిస్తుంది. ఇందుకు గాను Green Capitalsకు పోటీగా 'ఇస్తాంబుల్ క్యాపిటల్' 'కమాలిక్ క్యాపిటల్' లను స్థాపించి తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇన్ని కుట్రల తర్వాత కూడా 'అనాతోలిన్ టైగర్స్' తమ ఇస్లామీయ వాణిజ్య పునాదుల ఫలితంగా ఆర్థిక రంగంలో తమ ప్రభావాన్ని అద్భుతంగా నిరూపించుకుంటున్నారు. ఈ సంపదలోని ఒక పెద్ద మొత్తం సమాజ సంక్షేమం కోసం వినియోగించబడుతుంది. టర్కీలోని అనేక ధార్మిక, ఇస్లామీయ ఉద్యమ సంస్థలకు ఈ కంపెనీలలో భాగస్వామ్యం కల్పించబడింది. ఈ విధంగా శీఘ్ర అభివృద్ధి మరియు సంక్షేమం అనే చక్రంతో ఈ ఆర్థిక శకటం విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఇది మొత్తం ప్రభుత్వేతర , ప్రైవేట్ సెక్టారులోనే జరుగుతుంది. ఈ అద్భుతం నేడు ప్రపంచ ప్రజల దృష్టిని తనవైపు ఆకర్షిస్తూ ఉంది.

ఈ విధంగా ఇప్పటివరకు జరిగిన చర్చ ద్వారా తెలిసిన విషయాలను మనం అంశాలవారిగా, ఈ క్రింది విధంగా తెలుసుకోవచ్చు.

1. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ నేడు తన చరిత్రలోనే అత్యంత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుంది. పూర్తి మాంద్యం, సంక్షోభంలో కూరుకొని ఉంది. పెట్టుబడిదారులు, ఇన్సూరెన్స్‌పాలసీ నిర్మాతలు, అధినేతలు, యజమానులు అందరూ ఈ వ్యవస్థ ఓటమిని, అసఫలతను ఆమోదిస్తున్నారు. ఒక నూతన వ్యవస్థ కోసం (ఆర్థిక వ్యవస్థ కోసం) అన్వేషిస్తున్నారు. ఒక నూతన వ్యవస్థ అవసరాన్ని గుర్తిస్తున్నారు.

2. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థతో నేడు ప్రపంచం విసుగెత్తిపోయి వుంది. ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒక పెద్ద ఉద్యమ కెరటం లేచి ఉంది. ప్రజల మెజారిటీ ఇందులో భాగస్వామ్యమై ఉంది. అయితే ఇందుకు ప్రత్యామ్నాయం ఏమిటి? మార్పు ఎలాంటిదై ఉండాలి? అనే విషయం ఎవరికీ తెలియదు.

3. ఈ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ వైఫల్యం వల్ల, ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థ దాని విలువలు నేడు ప్రపంచంలో చర్చనీయాంశమై ఉన్నాయి. ఇప్పుడు ఇస్లాంను ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థగా ప్రతిపాదించటం గతం కన్నా సులభమైంది. ఒకవేళ ఇస్లామీయ విలువలతో కూడిన ఆర్థిక వ్యవస్థ స్థాపించబడితే ఈ ఆర్థిక సంక్షోభం, మాంద్యం, పటాపంచలైపోతుందని రుజువు చేయగలిగే వాతావరణం ప్రపంచ వ్యాపితంగా నెలకొని వుంది.

4. ఇస్లామీయ విలువల సఫలత నేడు కళ్ళముందు కనిపిస్తున్న దృశ్యంగా ఉంది. ఆచరణాత్మకంగానూ పరిమిత స్థాయిలో ఇది ఆమోదింపబడుతూ కూడా ఉంది. ఇస్లామీయ బ్యాంకులు సురక్షితంగా ఉండటం, టర్కీ వ్యాపార వాణిజ్య రంగాలు మూడు పువ్వులు – ఆరు కాయలుగా ఫలించటం, ఇందుకు కారణమైన ఇస్లామీయ విలువల పునాదులు బహిరంగమవటం, Green Capital సత్ఫలితాలు నేడు ప్రపంచం ముందు ఆవిష్కరించబడటం ఒక అనుకూల అంశంగా ఉంది. నేటి ఆధునిక కాలంలో ఇస్లామీయ విలువలు పునాదులుగా గల ఆర్థిక వ్యవస్థ, వ్యాపార వాణిజ్యాలు సఫలవంతంగా, విజయవంతంగా ముందుకు సాగడం ఒక ఆచరణాత్మక ఉదాహరణగా నమూనాగా రుజువు అయ్యింది.

ఇప్పుడు – ఈ వాతావరణంలో – ఈ నేపథ్యంలో ప్రశ్న ఏమిటంటే మనం ఏం చేయాలి? మౌలానా మౌదూదీ రహ్మా గారి 'సాక్ష్యం మానవాళి సమక్షంలో' దాని హక్కు నెరవేర్చటం అనేది నేటి తప్పనిసరి పనిగా ఇస్లామీయ వేదికలపై మరోసారి గుర్తు చేసుకోవడం జరుగుతుంది. అయితే మౌలానా మౌదూదీ రహ్మా తన గ్రంథంలో ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యాన్ని భవిష్యవాణిగా చెప్పారు అన్న ప్రకటనపైనే కేంద్రీకృతమై ' ఈ గుర్తు చేసుకోవడం'గా పరిమితమై పోయింది. నేను కూడా మౌలానా గారి మాటలను పునరుద్ఘాటిస్తున్నాను. అయితే, మీ దృష్టిని మౌలానా రహ్మా గారి ముగింపు, చివరి ఆచరణాత్మక పని వైపునకు మరలించే కృషి చేస్తున్నాను. ఆయన ఇలా అన్నారు:

"ఒకానొక సమయం తప్పకవస్తుంది. ఆ రోజున కమ్యూనిజం స్వయంగా మాస్కోలో తన్నుతాను రక్షించుకునే, కాపాడుకునే పనిలో పడుతుంది. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం స్వయంగా వాషింగ్‌టన్, న్యూయార్క్‌లలో తన ఉనికిని కాపాడుకునేందుకు అలమటిస్తుంది. భౌతికవాదం, స్వయంగా లండన్, పారిస్ యూనివర్శిటీలల్లో చోటు పొందేందుకు విలపిస్తుంది. వర్ణ వ్యవస్థ జాత్యాహంకారం, జాతీయవాదాలకు స్వయంగా బ్రాహ్మణుల, జర్మనుల స్థానాలలో చోటు దొరకని స్థితి వస్తుంది. ఇంకా నేటి ఈ పరిస్థితి చరిత్రలో ఒక గుణపాఠం పొందే ఘట్టంగా నిలిచిపోతుంది. ఇంకా ఇస్లాం వంటి విశ్వజనీనమైన, శక్తిమంతమైన ఆయుధం చేతిలో ఉండి కూడా వారు బుద్ధిహీనులుగా ఉండిపోయారు. మూసా (అలై) చేతిలో దైవ ప్రసాదిత మహిమాన్విత అసా (చేతికర్ర) ఉండింది. అయినా చిన్న కర్రముక్కలు, చిరుతాళ్ళను చూచి (పాములుగా) ఆయన (భ్రమించి) భయకంపితుడయ్యారు" *(షహాదతె హఖ్– సాక్ష్యం మానవాళి సమక్షంలో– నుండి)*

(ఈ ఉపన్యాసం, జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ స్థాయి బాధ్యుల సమావేశం– చెన్నై–డిసెంబర్–2011లో చేయబడింది)




- ముహమ్మద్ వహీదుద్దీన్

**ఇస్లాం** ధర్మంలో పండుగలు రెండు మాత్రమే 1) ఈదుల్ ఫిత్ర్ (రమజాన్) 2) ఈదుల్ అజ్‌హా (బక్రీద్). ధర్మబద్ధమైన పండుగలలో నుండి ఒకటైన ఈదుల్ ఫిత్ర్ పండుగ ఫిత్రాల పండుగ. అంటే బీదలకు ఫిత్రా దానం చెల్లించే పండుగ. ఈ ఫిత్రా నిరుపేదలు మొదలుకొని కోటీశ్వరుల వరకు ఖచ్చితంగా చెల్లించవలసి ఉంటుంది.

ఫిత్రా దానం ఒకవైపు మనం చేసిన ఉపవాసాల్లో దొర్లిన చిన్న చిన్న లోటుపాట్లను పూడ్చుతుందని దైవప్రవక్త (స) బోధన ద్వారా తెలుస్తుంది. మరోవైపు నిరుపేదలకు పండుగ సంతోషాన్ని పంచుతుంది. సంతోష సమయంలో, ఆనందవేళ క్రింది వారిని మరిచిపోయే తరుణంలో కూడా బీదల స్థితిని గుర్తు చేసే ఇలాంటి విధానం ఇస్లాంలో ఉంది. ఇది ముస్లింలలో పరస్పర దయ, సహకార గుణాలను పెంపొందిస్తుంది. హృదయాలను శుద్ధి చేస్తుంది. వారిలో పిసినారితనాన్ని అరికడుతుంది.

### పండుగ రోజు

ఈదుల్ ఫిత్ర్ (పర్వదినాన) ఉదయాన్నే చేయవలసిన ప్రత్యేక పనులు 15 ఉన్నాయి. 1) పొద్దునే నిద్ర లేవాలి 2) కాలకృత్యాలు తీర్చుకోవాలి 3) ఫజ్ర్ నమాజుకు ముందుగానీ తర్వాత గాని తలంటు స్నానం చేయాలి 4) ఉన్నవాటిలో మంచి దుస్తులు ధరించాలి 5) సువాసనలు పూసుకోవాలి 6) వ్యక్తిగత అలంకరణ చేసుకోవాలి 7) కళ్ళల్లో సుర్మా పెట్టుకోవాలి 8) ఈద్ నమాజ్ కంటే ముందే ఫిత్రా చెల్లించాలి 9) తీపి పదార్థాన్ని తినాలి 10) 1,3,5,7... ఇలా బేసి సంఖ్యలో ఖర్జూరపు పండును తినాలి 11) ఈద్గా మైదానానికి పోయేటప్పుడు ఒక దారిన వెళ్ళాలి 12) ఈద్గా నుంచి వచ్చేటప్పుడు మరొక దారి గుండా రావాలి 13) ఈద్ నమాజ్‌కు పోతూ తక్బీర్‌ను మెల్లగా పలుకుతూ ముందుకు సాగాలి 14) కాలినడక ద్వారా వెళితే ఇంకా ఎంతో పుణ్యం 15) పండుగ నమాజ్ తర్వాత ఒకరినొకరు సలాం చెప్పుకోవాలి.

'తక్బీర్' అంటే "అల్లాహ్ గొప్పవాడు, నిస్సందేహంగా అల్లాహ్‌యే గొప్పవాడు. ఆయన తప్ప మరో దేవుడు లేడు. అల్లాహ్ గొప్పవాడు, అల్లాహ్ గొప్పవాడు, స్తోత్రం ఆయనకే"

పండుగ రోజున ఇస్లామీయ శాసనాంగం చూపిన పరిధులలో స్వాదిష్టమయిన ఆహార పదార్థాలు సేవించడం, శుభాకాంక్షలు తెలుపుకోవటం సంప్రదాయం.

ఈ పర్వదినాన ప్రత్యేకంగా ఇతర మతాలకు చెందిన సోదర మిత్రులను ఆహ్వానించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటారు. వారిని విందులకు ఆహ్వానిస్తారు. తమ మిత్రులతో కలిసి విందు ఆరగించటంలోనే ముస్లిం మిత్రుడు సంతోషిస్తాడు. ఈ ఆత్మీయతా భావానికి అవధులు ఉండవు. అందువల్ల ఈ ఈదుల్ ఫిత్ర్ (పండుగ) మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నది.

ఈద్ నమాజ్ బస్తీ లేక గ్రామం బయట ఒక బహిరంగ ప్రదేశంలో అంటే ఈద్గాహ్‌లో చేయటం సున్నత్ (ప్రవక్త(స) సంప్రదాయం). సౌకర్యంలేని పక్షంలో మస్జిద్‌లో కూడా పండుగ నమాజ్ చేయవచ్చు.

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక



# ఊపిరి తిత్తులూ...

- ఎస్. ఎమ్. మలిక్

**దగ్గు బాగా పెరిగింది,** ఊపిరి పీల్చడం కష్టమవసాగింది. మా ఆవిడ గాభరా పడి అబ్బాయిని కేక వేసింది. ఇద్దరూ లేచి వచ్చేశారు.

"ఏమయింది నాన్నా!" సల్మాన్ ఆత్రంగా అడుగుతున్నాడు. నేను చెప్పే స్థితిలో లేను.

చిన్నోడు నోమాన్, "ఇప్పుడు ఎక్కడయినా డ్యూటీ డాక్టర్లే ఉంటారు" అన్నాడు.

నేను అప్పటికి తేరుకుని, "తెల్లవారు చూద్దాము, ప్రస్తుతానికి మీరు నిద్ర పోండి" అనగలిగాను.

సల్మాన్, నోమాన్ వైపునకు చూశాడు, 'అంతే' అన్నట్టు తలాడించాడు నోమాన్.

★ ★ ★

సల్మాన్ దుబాయ్‌లో ఓ కంపెనీలో మేనేజర్ పోస్ట్‌లో దాదాపు గత పద్దెనిమిదేళ్లుగా పని చేస్తున్నాడు. నన్నూ, మా ఆవిడనీ జులై 2023లో పిలిపించుకుని సంవత్సరం వీజా ఇద్దరికీ సమకూర్చాడు. మా రెండవ వాడు గుఫ్రాన్ మరో కంపెనీలో ఫైనాన్షియల్ అడ్వయిజర్‌గా పని చేస్తున్నాడు. వీరిద్దరితో పాటు మా మూడవ అల్లుడు కూడా బిల్డింగ్ కన్సల్టేషన్ కంపెనీ పెట్టుకుని తన స్వంత కంపెనీలో నలుగురికి ఉద్యోగాలు ఇవ్వగలుగుతున్నాడు. వీరందరి ప్రోద్బలం వల్ల అక్కడ ఉండటానికి ఒప్పుకోవడం తప్ప గత్యంతరం లేకపోయింది. లోగడ కూడా రెండు సార్లు మేమిద్దరం దుబాయ్‌కి వెళ్ళి ఉన్నాము.

దాదాపు అయిదారు నెలలు గడిపిన తరువాత నేను వ్రాస్తున్న ప్రవక్త చరిత్ర ముగియడంతో దాని ప్రింటింగ్ తదితర విషయాలను దగ్గర ఉండి చూసుకోవాలన్న కోరిక కలిగింది. సల్మాన్‌కు అదే చెప్పాను. వాడూ మరో ఉద్యమ కార్యకర్త కలిసి దాని ప్రింటింగ్ ఖర్చు "తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్"కు పంపించి వేశారు. "ఇప్పుడే కదా మీరు వచ్చింది, మీ వీసా పొడిగించి ఒక్క నెల కూడా కాలేదు అప్పుడే మీరు వెళ్తానంటే ఎలా, ప్రింటింగ్ గట్రా అక్కడ ఉన్న వాళ్ళు చూసుకుంటారు, మీరు వెళ్ళవలసిన అవసరం లేద"ని వాదించాడు సల్మాన్. అయినా నిజానికి నా ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు గమనించడం వల్ల నేను వెళ్ళవలసిందే అని పట్టుపట్టాను. కడకు ఒక మిత్రుడు ఇండియాకు వస్తూ ఉంటే గత్యంతరం లేక మా వాళ్లు నన్ను అతనితో పాటు పంపి వేశారు.

బహుశా నా మనోగతాన్ని అర్థం చేసుకున్నాడేమో సల్మాన్, ఈ వయసులో తల్లిదండ్రుల సేవ చేయడం కన్నా సంపాదించడం ముఖ్యం కాదని అనుకున్నాడో ఏమో. నేను హైదరాబాద్‌కు వచ్చిన తరువాత "నాన్నా, ఈ ఉద్యోగం చేస్తూ నేను బాగా అలసి పోయాను, నేను కూడా వచ్చేస్తాను" అని చెప్ప సాగాడు. అసలు విషయం అది కాదని అనిపించింది. వాడికి యాభయ్యేళ్ళు కావాలన్నా ఇంకా నాలుగేళ్ళు పోవాలి. మా ఆవిడ ఇంకా అక్కడే ఉన్నందువల్ల ఆవిడను అడిగాను. ఆమె "ఏమో తెలియదు, ఎప్పుడూ ఏదో విచారంగా అగుపిస్తూ ఉంటాడు" అని మాత్రం చెప్పగలిగింది.

మా చిన్నోడు నోమాన్, సల్మాన్‌కు చెప్పివేశాడు, నాన్న ఆరోగ్యం బాలేదనీ, అమ్మను సయితం పంపడం మంచిదని.

ఓ మిత్రుని ఫ్యామిలీ హైదరాబాద్ వస్తూ ఉండగా మా ఆవిడను వారితో పంపించాడు సల్మాన్. అలా వీసా పొడిగించిన డబ్బు, శ్రమ వృథా పోవడమే కాక మా అబ్బాయిలకు మనస్తాపం, బాధ కలగజేసిన వాణ్ణయ్యాను. నేనేం చెయ్యనూ, నా పరిస్థితి అలా పరిణమించింది.

★ ★ ★

మరుసటి రోజు ఉదయం ఖాలిద్ బావజీర్‌కి ఫోన్ చేస్తే "ముస్లిమ్ జనరల్ హాస్పిటల్‌లో ఇప్పుడు జనరల్ ఫిజిసి

యన్‌గా డాక్టర్ సల్మాన్ వచ్చాడు. ఆయన అసలు న్యూరోల జిస్ట్, కాని సాధారణ వ్యాధులకు కూడా చికిత్స చేస్తారు, నేను మా వాళ్ళను చూపించాను. మీరు నమ్మకంగా ఆయన్ని కన్సల్ట్ చేయవచ్చు. నేను చెబుతున్నాగా!"అని బదులిచ్చారు.

సరేనని సల్మాన్‌తోపాటు వాదియె హుదాలోని మన కార్య కర్తల ఆధ్వర్యంలో నడుస్తున్న ఎమ్.జీ.ఎచ్. కు వచ్చాము. నిజంగానే డా. సల్మాన్ యువకుడయినా నన్ను పరీక్షించి "మిమ్మల్ని పల్మనాలజిస్ట్‌కు చూపించాలి. అతను సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో వస్తాడు. మిమ్మల్ని అడ్మిట్ చేస్తు న్నాను, మందులూ మొదలవుతాయి" అంటూ నర్స్‌కి అప్ప గించారు.

కన్సల్టింగ్ రూమ్ నుంచి బయటకు వచ్చి కూర్చున్నాము. అయిదు నిముషాల్లో సిస్టర్ వచ్చి రూమ్ రెడీ చేసి రూముకు తీసుకు వెళ్లి అక్కడ వదలి ఏమయినా అవసరమయితే నేను ఇక్కడే ఉంటాను పిలవండీ అని చెప్పి వెళ్ళిపోయింది.

## కృతఘ్నుడు మనిషి

మనిషి తాను ఏమేమో అని తలపోస్తాడు. ఓ చిన్న అవయవం కాస్త అదుపు తప్పితే తల్లడిల్లి పోతాడు. నాకు చిన్నప్పటి నుండి పొట్ట(కడుపు)కు సంబంధించిన సమస్యలు ఉండనే ఉన్నాయి. నలభై ఏళ్ల ప్రాయంలో న్యూరో (నరాలకు) సంబం ధించి చిక్కుల్లో పడిపోయాను. అరవైకు చేరే సరికి గుండె మొరాయించింది. అంతటితో సంబరపడి పోయాను.★ ఎనభై నాలుగవ పడిలో మరో ఉదంతం మొదలవుతుందని అనుకో లేదు. కాని దైవం పరీక్షించాలని తలిస్తే ఊహలన్నీ తల్లక్రిందు లవుతాయి!

ఆ రోజు సాయంత్రం పల్మనాలజిస్ట్ వచ్చి పరీక్షించి సీటీ స్కాన్, ఎక్స్ రే, రక్త పరీక్షలు చేయాలని అన్నాడు. నెబులైజర్ చికిత్స అప్పటికే డా. సల్మాన్ మొదలెట్టడం వల్ల, రెండు మందులు పెంచి కంటిన్యూ చేయమన్నాడు. నేను హతాశు డనయ్యాను. అయిదు రోజులు ఆ చికిత్స సాగింది. అప్పటికి గానీ ఒక్కొక్క అవయవం విలువ తెలిసి రాలేదు! నా ఊపిరి తిత్తులు చాలా ఆరోగ్యంగా ఉన్నాయని తలిచేవాణ్ణి, అంతా పటాపంచలయింది!! అవి అతి తీవ్రంగా ఇన్ఫెక్షన్‌కు గురయ్యాయట!

ఇన్ని రోజులు నాకేం ఫర్వాలేదు అనుకునేవాణ్ణి. దిమ్మ తిరి గింది. ఒక్కొక్క అవయవం మహా వరప్రసాదం అన్న తెలివిడి కాస్తా అంతర్ జ్ఞానంగా మారింది. ఆంతర్యంలో రోదించడం తప్ప చేయగలిగింది ఏముంది? ఎంత కృతజ్ఞతా విహీనుడు మనిషి! అవయవాలు సజావుగా ఉన్నంతకాలం తల బిరుసుగా ఉంటాడు, కాస్త నడక మారగానే నానా ఊహలకు లోనవుతాడు. నా ఆవేదనకు అవధుల్లేకుండా పోయింది!

అయిదు రోజుల తరువాత డిస్చార్జ్ అయ్యాను. ఇంటిలోనూ నెబులైజర్ (ఊపిరితిత్తుల వ్యాధులకు మందు ద్రవాన్ని పొగగా మార్చి శ్వాస నాళం ద్వారా ఊపిరి తిత్తులకు పంపే చిన్న పరికరం), మందులతోపాటు చికిత్స సాగుతూనే ఉంది. ఏమయిందో ఏమో నాలుగు రోజుల తరువాత మళ్ళీ శ్వాస ఇబ్బంది మొదలయింది. వెంటనే హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళారు అబ్బాయిలు. మా ఆవిడ కూడా దగ్గుతో బాధ పడ సాగింది. ఆమెను సయితం ఒక రోజు చికిత్స నిమిత్తం హాస్పిటల్‌లో అడ్మిట్ చేసి ఇంటికి పంపించారు.

## ఇక్కడ వీల్లేదు

మూన్నాళ్ళ తరువాత దగ్గు తీవ్రమయింది, శ్వాస మరీ దుర్భర మయింది. నాతో పాటు ఉంటున్న సల్మాన్, "నాన్నా, ఇక్కడ వీల్లేదు, మరో హాస్పిటల్‌కు వెళ్దాం" అన్నాడు బాధగా.

"నీ ఇష్టం" అన్నట్టు సైగ చేశాను బహుశా. లోగడ చికిత్స పొందుతున్న ఆలివ్ హాస్పిటల్ అని నోమాన్ చెప్పాడు. అతను డ్యూటీ డాక్టర్‌తో అదే మాట చెప్పి ఆంబులెన్స్ అరేంజ్ చేయ వలసిందిగా కోరాడు.

హుటాహుటిన బయలుదేరాము. నాకు వ్యాకులత పెరిగింది. దారిలో సల్మాన్‌కు కొన్ని విషయాలు చెప్పసాగాను. అప్పుడు అవన్నీ వద్దు, తరువాత మాటలాడుకుందాము అంటూ నన్ను వారించాడు వాడు.

ఆలివ్ హాస్పిటల్‌లో నేరుగా ఎమర్జెన్సీలోకి తీసుకు వచ్చారు. అక్కడ డాక్టర్లు వచ్చి పరీక్షించారు. వెంటనే ఏదో ఇంజెక్షన్ మందూ ఇచ్చి క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయు- అత్యంత తీవ్ర శ్రద్ధ చూపవలసిన విభాగం)కి తరలించారు. అక్కడ

*★గురువు గార్కి 1999లో గుండె జబ్బు వచ్చింది. స్టంట్ అమర్చారు. ఆ రోజుల్లో కూడా అలుపెరుగని ఈ కృషీవలుడు "నాకూ గుండె ఉంది" అంటూ గీటురాయిలో సీరియల్ వ్రాశారు. (ఎప్పుడయినా పుస్తక రూపం ఇవ్వొచ్చన్న ఆలోచనతో దాని ఇండెక్స్‌ను కూడా భద్రపరిచాము). ఇప్పుడు 'ఊపిరితిత్తులూ' ఉన్నాయని వ్రాస్తున్నారు. దటీజ్ మలిక్! అల్లాహ్ గురువు గార్కి సంపూర్ణ ఆరోగ్య సంపదను ప్రసాదించాలని ప్రార్థన.*

***-సంపాదక వర్గం***

నెబులైజర్, ఇంజెక్షన్లతో చికిత్స మొదలయింది. నేను బహుశా అలసట వల్ల నిద్రలోకి జారుకున్నాను. నేను నిద్ర మబ్బులోనో మందుల ప్రభావం వల్లనో మగతగా ఉన్నప్పుడు అదుపు తప్పిన అరపులూ భరింపరాని కేకల వల్ల నేనెక్కడున్నానో అర్థం కాని స్థితిలో ఉన్నాను.

తెల్లవారిన తరువాత రాత్రి జరిగిన హంగామా అంతా నా ప్రక్కన ఉన్న బెడ్ మీదనే జరిగిందని తెలుసుకుని బాధ కలిగింది. ఆ వ్యక్తి వయసు నలభై, యాభై మధ్య ఉంటుంది. నర్సులూ మేల్ నర్సులూ దాదాపు పది మంది ఉంటారు ఆ యూనిట్‌లో, బెడ్లులూ పన్నెండే ఉన్నాయి. ఒక మేల్ నర్స్‌ని సైగతో దగ్గరికి పిలిచాను. రాగానే అడిగాను, "నీవు చాలా తమాషాగా మాట్లాడుతావు నాకు నచ్చింది" అన్నాను. చిలిపిగా నవ్వాడు, "ఏముంది సార్, జీవితంలో నాలుగు రోజులు ఆడుతూ పాడుతూ గడిపి వేయాలి" అంటూ మళ్ళీ నవ్వాడు. అటు వెళుతున్న మరో మేల్ నర్స్‌ని చూసి కన్ను గీటాడు! అతనూ నవ్వాడు.

## సుహృద్భావ వాతావరణం

నేను మరుసటి రోజే గమనించాను ఆ మేల్ నర్స్ డ్యూటీలోకి రాగానే అక్కడి సిబ్బంది ముఖాల మీద దరహాసం తొణకిసలాడుతుంది. అతనూ ఇతర నర్సులూ హెడ్ నర్సూ ఆహ్లాదంగా మాటలాడుకుంటూ నవ్వుకుంటూ సరదాగా ఏమాత్రం జాగు చేయకుండా తమ తమ బాధ్యతలు మాత్రం పూర్తిగా నిర్వర్తించుకుంటూ ఉంటారు.

నాకు మూడు పూటలా నెబులైజర్ పెట్టడమయినా, ఇంజెక్షన్లూ టాబలెట్లూ ఇవ్వడమయినా, సమయానికి టిఫిన్, మీల్స్ అందించడమయినా అంతా సక్రమంగా జరుగుతోంది. నాకే కాదు ప్రతి పేషెంట్ పట్ల అదే వ్యవహారం. సాయంత్రం ఒక గంట విజిటింగ్ అవర్‌లో ఆప్తులు వచ్చి ఒకరి తరువాత ఒకరు పరామర్శించి పోతూ ఉంటారు. మొదటి రోజు మా ఆవిడ వచ్చి మొదటే ఇక్కడికి వచ్చి ఉంటే ఎంత బావుండేది అని బాధ వెళ్ళగ్రక్కింది. దానికి నేను "మనవాళ్ళు నడుపుతున్న హాస్పిటల్‌ని పైకి తీసుకు రావాలని కదా నేను అక్కడికి వెళ్ళింది" అని సర్ది చెప్పాను.

ఆ యూనిట్‌లో అనేక విధాల బాధితుల్ని చికిత్స నిమిత్తం పంపుతారు. నా ప్రక్కన వ్యక్తికి బైక్ యాక్సిడెంట్‌లో మెదడుకు దెబ్బ తగిలింది. అందువల్లనే అదుపు తప్పిన కేకలు. మరో రోగికి అత్యంత తీవ్రమయిన పక్షవాతం. ఇంకో వ్యక్తి మూత్ర కోశ వ్యాధిగ్రస్తుడు. ఇంకా ఎన్నెన్నో బాధలు! అందరితో, డాక్టర్లతో సహా సిబ్బంది మొత్తం నవ్వుకుంటూ మాట్లాడుతారు.

## కారణం తెలియదు

నాకు శ్వాస కోశ వ్యాధి-ఊపిరి తిత్తుల ఇన్ఫెక్షన్. ఒక ఊపిరి తిత్తిలో తత్కారణంగా ఒక భాగంలో ఖాళీ ఏర్పడింది. దాని పరిధి, వ్యాప్తి అంచనా వేయడానికి "బ్రాంకో స్కోపీ" చేయవలసి ఉంటుంది అని హైదరాబాద్‌లోనే వినుతి కెక్కిన డాక్టర్ బన్సల్ నాకూ తెలుపుతూ మా అబ్బాయిలకూ చెప్పాడు. అంటే శ్వాస నాళం ద్వారా లోనికి కేమరా పంపి పరీక్షిస్తారట!

నేను బాధను తట్టుకోలేక డాక్టర్‌ని అడిగాను, "నేను సిగరెట్లు ఎన్నడూ ముట్టుకోనయినా లేదు, నాకు గుండె జబ్బు ఉంది, న్యూరో సమస్యలు ఉన్నాయి కాని ఈ వయసు వరకు ఎటువంటి ఊపిరితిత్తుల వ్యాధి నేనెరుగను. ఇప్పుడు నా తప్పేమిటీ" అని.

ఆయన, "మీ తప్పేమీ లేదు, వాతావరణంలోని ఇన్ఫెక్షన్ మిమ్మల్ని కాటేసింది" అని కాస్త చిరునవ్వు చిందిస్తూ చెప్పాడు. ఆ రోజే సీసీయూలోనే పోర్టబుల్ కేమరా యూనిట్ తెప్పించి ఎక్స్‌రే తీశారు. మరుసటి రోజు సీ. టీ. స్కాన్ కూడా జరిగింది. ఆ తరువాతి రోజు వచ్చినప్పుడు డాక్టర్, "ఊపిరి తిత్తుల్లో మూసుకు పొయిన భాగం తెరుచుకుంది. ఇక బ్రాంకో స్కోపీ అవసరం లేదు" అని సంతోషంగా చెప్పాడు. ఆ సందర్భంలోనే తన అసిస్టెంట్‌తో "రూముకు షిఫ్ట్ చేద్దాం" అని చెప్పాడు.

నేను డాక్టర్‌ని అడిగాను, "నాకు ఆస్తమా అవుతుందా, డాక్టర్!"

"చెప్పలేము, కొందరికి ఇటువంటి ఒక్క ఎటాక్‌తో ఆగిపోతుంది, మరికొంత మందికి ఆస్తమా పట్టుకునే ప్రమాదముంటుంది."

నోరు తెరిచి కళ్ళప్పగించడం తప్ప నేనేం చేయలేక పోయాను. ఇంతగా పురోగమించిన సైన్సు మెడికల్ సైన్సు నిస్సహాయత పట్ల వెటకారంగా నవ్వడం, కప్పు ఎగిరేలా నిస్సహాయతతో నవ్వడం తప్ప ఎవరయినా చేయగలిగిందేముంది?!

## రూముకు

ఏ డాక్టర్ వచ్చినా గుమికూడే డ్యూటీ డాక్టర్, హెడ్ నర్స్, నర్సులూ అందరూ ఆ సమయంలోనూ చేరి అంతా శ్రద్ధగా విన్నారు. డాక్టర్ అటు వెళ్ళగానే హెడ్ నర్స్ వచ్చి నవ్వుతూ

"బాబా, కంగ్రాట్స్! మీరు ఇక్కడ ఉన్నంత కాలం మాకు ఎన్నో మంచి విషయాలు చెప్పారు. మిమ్మల్ని మరచి పోలేము" అంటూ కరచాలనం చేసి డ్యూటీ మారే సమయం కావడంతో బైబై చెప్పి వెళ్ళి పోయింది. ఏదో బూచీబూచీగా పెరిగిన నా గడ్డం మీసాలు చూసి డాక్టర్లు మొదలుగా నర్సుల వరకు అందరూ నన్ను 'బాబా బాబా' అని పిలువసాగారు.

ఆమె ప్రస్తావించిన ఆ మంచి మాటలు ప్రత్యేకం ఏమీ కావు. తమాషాగా మాటలాడే కర్ణాటకకు చెందిన మేల్ నర్స్ (బహుశా అతని పేరు మొయిన్)తో ఇతర నర్సులూ నా వద్దకు వచ్చి ఇంజెక్షన్ గట్రా ఇస్తున్న సందర్భంలో వారు ఇక్కడ చేస్తున్న సేవలు ఎంత ఉన్నతమయినవో, మనల్ని పుట్టించిన దైవం దృష్టిలో ఎంత ఘనమయినవో చెప్పాను. ఒక రోగిని పరామర్శించడానికి అతని వద్దకు వెళ్ళినప్పుడు అక్కడ నన్ను కానగలరని దైవం స్వయంగా చెప్పాడు. అలాంటప్పుడు రోగుల చికిత్స ఎంత గొప్ప విషయం!

ఇంకా మానవ సేవ ప్రాశస్త్యం గురించీ వివరించే వాడిని. నేను మాటలాడే సమయాన డాక్టర్లు ఉండరు కాబట్టి అందరూ ఆసక్తిగా వినేవారు. అక్కడి సుహృద్భావ పూరిత వాతావరణాన్ని కొనియాడుతూ ఈ వాతావరణం నాకు బాగా నచ్చిందని చెప్పేవాణ్ణి. అందరూ సంతోషించేవారు. ఇదీ హెడ్ నర్స్ తాను వెడుతూ నన్ను రూముకు సాగనంపుతూ చెప్పిన విషయానికి నేపథ్యం!

## రూములో

అయిదవ అంతస్తులో ఉన్న సీసీయూ నుంచి మూడవ అంతస్తులోని రూము నె. 301 కు, శుక్రవారం ఫిబ్రవరి 28న రాత్రివేళ మార్చడం జరిగింది. రూములో పేషెంట్ బెడ్‌తో పాటు అట్టెండెంట్‌కు కూడా పడక ఏర్పాటు ఉంది. సల్మాన్ నాకు తోడుగా ఉన్నాడు. మరుసటి రోజు శనివారం కూడా మునుపటి చికిత్సే కొనసాగుతోంది. మా డాక్టర్ తమ్ముడు ఆసిఫ్ కుమారుడు అబ్బూ (అబూ అమ్మార్) ఆ రోజు సాయంత్రం వచ్చి తరువాతి రోజు రమజాన్ ఉపవాసం పాటించేందుకు కడరేయి భుజించే సహరీ కొరకు భోజన సామగ్రి ఇచ్చి వెళ్ళాడు. అక్కడ ఉన్న మూడు రోజులూ అతనే సహరీ ఇఫ్తార్ సామగ్రి సమకూర్చాడు. నాకు హాస్పిటల్ వాళ్ళు సరఫరా చేసే పల హారం అయినా మీల్స్ అయినా రుచి హీనంగా పరిణమించాయి. అవి రుచికరంగానే ఉన్నాయేమో నాకు చప్పగా ఉన్నట్లు అనిపిస్తోంది. అదే మాట డాక్టర్‌ని అడిగాను, అది పుచ్చుకున్న మందుల ప్రభావం, కొన్నాళ్ల తరువాతనే పోతుందన్నారు.

ఆ పైన మార్చి 4వ తేదీ నాటికి మా అబ్బాయిలతో మాటలాడి అయిదు రోజుల తరువాత రివ్యూకి రావాలని చెప్పి డిస్చార్జ్ చేసి వేశారు. ఫార్మాలిటీస్ పూర్తి అయి ఇంటికి వచ్చేసరికి రాత్రి అయ్యింది.

రివ్యూకి వెళ్ళినప్పుడు పరీక్షించి పూర్తిగా కోలుకునే వరకు ఒక నెల పడుతుందని అన్నారు.

నాకు ఈ నెల సొంతం సాగిన ఉదంతం ద్వారానే మెదడులో తళుక్కున మెరిసింది:

*"ఓ హెూ! నాకు గుండె మాత్రమే కాదు,*

*(ఇంకా ఏమేమున్నాయో కాని)*

*బహుశా కాదు, కాదు నిజంగానే...*

*ఊపిరి తిత్తులు మటుకు తప్పక ఉన్నాయి మరి!"*


గీటురాయి వారపత్రిక

**ముఖ్య ఆశయాలు**

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంతరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ, నైతిక పథకం

గీటురాయి వారపత్రిక




**రమజాను నెలలో ముస్లిములు ఉపవాసాలు ఎందుకు పాటిస్తారంటే, అలా చేయాలని దేవుడు దివ్యఖుర్ఆన్‌లో ఆదేశించాడు కాబట్టి ఉపవాసాలుంటారు.**

"పవిత్ర ఖురాను అవతరించిన నెల రమజాను నెల. మానవులందరికీ (ఆ గ్రంథం) మార్గదర్శకం. రుజుమార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి. కనుక ఇక నుండి రమజాను నెలను పొందే వ్యక్తి ఆ నెల అంతా విధిగా ఉపవాసం ఉండాలి. కాని వ్యాధిగ్రస్తులైనవారు లేదా ప్రయాణంలో ఉన్నవారు, ఆ ఉపవాస దినాలను వేరే దినాలలో పూర్తి చెయ్యాలి." (అల్ బఖరా 185)

రమజాను మాసంలో ముస్లిములు తప్పనిసరిగా ఉపవాసాలు పాటించడానికి కారణమిది. మనిషి ఎలా జీవితం గడపాలన్న దారి చూపించే దివ్యఖుర్ఆన్ మానవాళికి లభించినందుకు దేవునికి కృతజ్ఞతగా, దేవుని పట్ల భయభక్తులతో ఉపవాసాలు ఉంటారు.

మనిషి ఉపవాసాలున్నానని చెప్పి దొంగచాటుగా, ఒంటరిగా ఉన్నప్పుడు ఏమన్నా తిన్నా, తాగినా అడిగేదెవ్వరు? మానవ మాత్రులెవరూ అడగలేరు. కాని దేవుడు అన్నీ చూస్తూనే ఉంటాడు. దేవుని పట్ల ఈ విశ్వాసం, భయభక్తులే ఉపవాసాన్ని దేవుని ప్రత్యేక ఆరాధనగా మార్చాయి. ఉపవాసమున్నవారు ఎవరూ చూడని ఏకాంతంలో ఉన్నప్పటికీ పచ్చి మంచినీరు కూడా తాగకుండా నిగ్రహాన్ని పాటిస్తారు.

అంటే - ఉపవాసం ఒక బాధ్యతాభావాన్ని మనిషిలో సృష్టిస్తుంది. దేవుడు చూస్తున్నాడన్న బాధ్యతాభావం అది. అందుకే చిన్న పిల్లలైనా పచ్చిమంచినీరు కూడా ముట్టరు. ఇదే బాధ్యతాభావం ప్రతి పనిలోను రావాలి. లంచం తీసుకుంటే పోలీసులు పట్టుకుంటారన్న భయం చాలా చిన్నది. పోలీసులకు పట్టుబడకుండా లంచం తీసుకునే దారులు వెదుకుతాడు. కాని దేవుడు చూస్తున్నాడు అనే భయమే ఉంటే లంచం జోలికి పోడు. అలాగే అనేక సామాజిక రుగ్మతలకు దూరంగా ఉంచడానికి ఈ బాధ్యతాభావం ఉపయోగపడుతుంది. దేవుడు చూస్తున్నాడన్న ఆలోచన మనస్సులో ఉంటే మంచిపనులు చేయడానికి పరులకు సహాయపడడానికి ఉత్సాహం చూపించే మనస్తత్వం ఏర్పడుతుంది. ఉపవాసాల మొదటి ప్రయోజనం ఇది.

భారతదేశంలో అయితే దాదాపు పదహారు గంటల పాటు, ఇంగ్లాండు వంటి దేశాల్లో అయితే దాదాపు పద్దెనిమిది గంటల పాటు అన్నపానీయాలకు దూరంగా ఉండడం వల్ల ఎంత సంపన్నుడైనా ఆకలి బాధ, దప్పిక బాధేమిటో అనుభవ

పూర్వకంగా తెలుసుకుంటాడు. పేదల కష్టాలను అర్థం చేసుకుని ఆదుకుంటాడు.

అన్నపానీయాలకు దూరంగా ఉండడమే కాదు, తమ వద్ద ఉన్న ఆహారాన్ని ఇతరులతో పంచుకోవడం ఈ నెలలో చాలా సాధారణంగా కనబడే దృశ్యం. మస్జిదుల్లో ఇతర ప్రదేశాల్లో ఉపవాస విరమణ అంటే ఇఫ్తార్ జరుగుతున్నప్పుడు చాలా మంది తమతో పాటు ఆహార పదార్థాలు తీసుకుని వస్తారు. చాలా మంది ఏమీ చేతుల్లో లేకుండానే హడావిడిగా వచ్చేస్తారు. తమ పక్కన ఉన్న వ్యక్తి పరిచయస్తుడా కాదా అన్నది ఎవరూ పట్టించుకోరు. ఆహారం తన వద్ద ఉన్న వ్యక్తి ఎదుటి వ్యక్తి ముందు పెడతాడు. అవతలి వ్యక్తి కూడా నిస్సంకోచంగా తీసుకుని తింటాడు. తినే ప్రతి వ్యక్తి మిగిలిన వారికి సరిపోతుందో లేదో అన్న ధ్యాసతోనే తింటాడు. ఇలా పంచుకుని తినే అందమైన వాతావరణం మనకు రమజానులో చాలా సాధారణంగా కనబడుతుంది. ఇదే పద్ధతి మొత్తం సంవత్సరమంతా ఉంటే, ఆకలితో బాధపడే వారెవ్వరూ సమాజంలో ఉండరు. అంతేకాదు, రమజాను మాసంలో అన్నదానాలు, ఇఫ్తార్ విందులు జరుగుతూనే ఉంటాయి. అందులో పేదలు, మధ్యతరగతి, సంపన్నులు అనే తేడా లేకుండా అందరూ పాల్గొనడం కూడా చూడవచ్చు. సామాజికంగా అందరం ఒక్కటే అనే అద్భుతమైన అందమైన భావన ఆచరణాత్మకంగా కనిపిస్తుంది.

రమజాను మాసంలోనే సాధారణంగా ముస్లిములు జకాత్ ఇస్తుంటారు. ఉపవాసాలు ఉండడం, జకాత్ ఇవ్వడం ఈ రెండు మనకు రమజాన్ మాసంలో ప్రత్యేకంగా కనబడే ఆరాధనలు. జకాత్ నిజానికి సంపదపై పన్ను వంటిది. పేదరిక నిర్మూలనకు ఏం చేయాలి? పేదరిక నిర్మూలనకు ఇస్లామ్ ప్రతిపాదించే సూత్రం పంపిణీ. తన వద్ద ఉన్న సంపదలో పేదసాదలకు కూడా హక్కు ఉందని గుర్తించి వారి హక్కును వారికి ఇవ్వడం, ఒక బాధ్యతగా ఇవ్వడం. ఇదే పేదరిక నిర్మూలనకు తోడ్పడే ముఖ్యమైన పద్ధతి. ఉత్పత్తి పెంచడంతో పాటు సంపద పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు లేకపోతే పేదరికాన్ని పారదోలలేము. పంపిణీని ప్రోత్సహించే ఇస్లామీయ విధానం మనుషుల మధ్య ప్రేమను పెంచుతుంది. సంపద పంపిణీకి ఇస్లామ్ ప్రతిపాదించే గొప్ప నియమం జకాత్. అంటే తప్పనిసరిగా చేయవలసిన దానం.

ఈ యావత్తు మాసం ఒక శిక్షణాకాలం వంటిది. ఇస్లామీయ బోధనలు, ప్రమాణాల ప్రకారం జీవితాన్ని గడిపే శిక్షణ ఇచ్చే మాసం. ఈ నెల రోజుల శిక్షణ తర్వాత మిగిలిన పదకొండు నెలలు ఈ ప్రకారమే జీవించడం అలవడుతుంది. ఆరాధనల విషయంలో ఇస్లామ్ నిర్వచనం విభిన్నమైనది. విధిగా చేయవలసిన నమాజ్, రోజా, జకాత్, హజ్ వంటి ఆరాధనలే కాదు, దేవుని ప్రసన్నత కోసం ఖుర్ఆన్ ఆదేశాల ప్రకారం చేసిన ప్రతి మంచి పని ఆరాధన కిందికే వస్తుంది. చివరకు ప్రేమగా తన భార్య నోటికి ఒక ముద్ద ఆహారం అందించడం కూడా పుణ్య కార్యమే. కాబట్టి ఆరాధనల నిర్వచనం ఇస్లాములో విశిష్టమైనది. దైవప్రసన్నత పొందే పనులు ఎప్పుడు చేసినా పుణ్యప్రదమైనవే, ఆరాధనలే. రమజాను మాసంలో ఇవే పనులకు అనేక రెట్లు ఎక్కువ పుణ్యం లభిస్తుంది. కాబట్టి ముస్లిములు ఈ మాసంలో అత్యధికంగా దానధర్మాలు చేయడం కనబడుతుంది.

ఇస్లాములో దానధర్మాలు కూడా రెండు రకాలు. ఒకటి తప్పనిసరిగా చేయవలసిన దానం. దీన్ని జకాత్ అంటారు. జకాత్ అంటే శాబ్దిక అర్థం శుభ్రం చేయడం. తన వద్ద ఉన్న సంపదలో రెండున్నర శాతం జకాత్‌గా చెల్లించడం ద్వారా సంపదను శుద్ధి చేసుకోవడమే జకాత్. ఇది తప్పనిసరిగా చేయవలసిన దానం. రమజాన్ మాసంలోనే జకాత్ చెల్లింపులు జరుగుతాయి. జకాత్ ఎవరికి చెల్లించాలన్నది కూడా నిర్దిష్టంగా ఉంది. రమజాను మాసంలో తప్పనిసరిగా చేసే మరో దానం ఫిత్రా. రమజాను మాసం తర్వాత ఈద్ పండగ నమాజు కన్నా ముందే ఇది తప్పనిసరిగా చెల్లించాలి. ప్రతి కుటుంబంలో ఎంత మంది ఉంటే, తలా ఒక్కింటికి రెండున్నర కిలోల ధాన్యం లేదా దాని వెల పేదలకు ఇవ్వాలి. పండగ రోజున పేదసాదలు కూడా ఆనందంగా పండగ చేసుకునే ఏర్పాటిది. ఇవి రెండూ తప్పనిసరిగా చేయవలసిన దానాలు. ఇవి కాకుండా సదఖా రూపంలో స్వచ్ఛందంగా చేయవలసిన దానాలను కూడా ప్రోత్సహించడం జరిగింది. అందుకే రమజాను మాసంలో విస్తృతంగా ముస్లిములు దానధర్మాలు చేయడం మనకు కనబడుతుంది.

**"మేము ఇస్రాయీలు సంతానం నుండి మరొక వాగ్దానం తీసుకున్నాము. దానిని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి : "అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రులను, బంధువులను, అనాథులను, నిరుపేదలను ఆదరించాలి. ప్రజలను సహృదయంతో పలుకరించాలి. నమాజును స్థాపించాలి. జకాత్ ఇవ్వాలి." (అల్ బఖర : 83)**

"కేవలం పరుల మెప్పును పొందటానికే తన ధనం ఖర్చుచేసేవాని మాదిరిగా అల్లాహ్‌ను అంతిమదినాన్నీ విశ్వసించని వాని మాదిరిగా, మీరు దెప్పిపొడిచి, గ్రహీత మనస్సును గాయపరచి మీ దాన ధర్మాలను మట్టిలో కలపకండి.'' (అల్ బఖరా : 263)

జకాత్ లేదా తప్పనిసరిగా చెల్లించవలసిన దానం గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలాంటి వాక్యాలు అనేకం కనిపిస్తాయి. సమాజంలో దురదృష్టవంతులు, నిర్భాగ్యులైన వారిని ఆదుకోవాలని దానధర్మాలు చేయాలని ఇస్లామ్ బోధిస్తుంది. ముఖ్యంగా రమజాను మాసంలో అందువల్లనే ముస్లిములు ఇతోధికంగా దానధర్మాలు చేస్తుంటారు. ఖర్చుకు ఏమాత్రం వెనుకాడరు. దేవుని ప్రసన్నతతోపాటు ఇవ్వడంలో ఉన్న ఆనందాన్ని కూడా అనుభవిస్తారు.

ఇలా చేసే దానధర్మాల ప్రాముఖ్యమేమిటి? అన్నది ఆలోచించ వలసిన విషయం. ఆక్స్‌ఫామ్ సంస్థకు స్ట్రాటజిక్ అడ్వయిజర్‌గా పని చేసిన డంకన్ గ్రీన్ రాసిన కొన్ని మాటలు ఇక్కడ ప్రస్తావించడం అవసరం. "ఫ్రం పోవర్టీ టు పవర్" పేరుతో ఆయన ఈ మాటలు రాశాడు. ఒకసారి ఆయన విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు ఆయన పక్కన ఒక ముస్లిం యువకుడు కూర్చున్నాడు. ఆ ముస్లిం యువకుడు మాటల్లో జకాత్ గురించి చెబుతూ, ముస్లిం సముదాయం వ్యవస్థాగతంగా, ప్రణాళికాబద్ధంగా జకాత్ నిధులను నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. డంకన్ గ్రీన్‌కు ఈ జకాత్ గురించి తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. ఆయన కాస్త రిసెర్చ్ చేసి గ్లోబల్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ ప్రచురించిన "యాన్ యాక్ట్ ఆఫ్ ఫెయిత్" నివేదికను చదివాడు. ఈ నివేదికలో ఏం రాశారో మనం కూడా చూద్దాం.

ప్రపంచవ్యాప్తంగా మానవీయ సహాయం అవసరమైన సంక్షోభాలు అనేకం తలెత్తుతున్నాయి. అంతర్జాతీయ మానవీయ సహకారం కోసం నిధులు పెరుగుతున్నప్పటికీ అవి సరిపోవడం లేదు. చాలా మందికి తెలియకుండానే ఒక గొప్ప ధార్మిక విధి రూపంలో జకాత్ నిధులు మానవీయ సహకారాన్ని అందిస్తున్నాయి. ఇస్లామీయ సోషల్ ఫైనాన్సింగ్ ఇది. మానవీయ సహాయానికి అవసరమైన నిధులను అందించే ఇలాంటి సోషల్ ఫైనాన్సింగ్ టూల్స్ ఇస్లాములో చాలా ఉన్నాయి. ఈ విషయమై గ్లోబల్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ సేకరించిన డాటా ప్రకారం:

స్వచ్ఛంద సంస్థల ద్వారా 2013లో 434 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే 2900 కోట్ల రూపాయల ఇస్లామీయ మానవీయ సహకార నిధులు పంపిణీ అయ్యాయి. ఇవి స్వచ్ఛంద సంస్థల ద్వారా పంపిణీ అయిన నిధులు. ఇందులో జకాత్ ఇతర సదఖాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థల వంటి అధికార సంస్థలు సేకరించిన జకాత్ నిధుల విషయానికి వస్తే, ముస్లిం దేశాల్లోనే ఇలా ప్రభుత్వ సంస్థలు జకాత్ నిధులను సేకరించడం జరుగుతుంది. ఇండోనేషియా, మలేషియా, ఖతర్, సౌదీ అరేబియా, ఎమన్ దేశాల డాటాను గ్లోబల్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ సేకరించింది. ప్రపంచ ముస్లిం జనాభాలో 17 శాతం ఈ దేశాల్లో ఉంది. ఈ దేశాల్లో వసూలు చేయబడిన జకాత్ నిధులు ఏటా 5.7 బిలియన్ అమెరికన్ డాలర్లు. 38088 కోట్ల రూపాయలు. ఇవి కేవలం 17 శాతం ముస్లిం జనాభా ఉన్న దేశాల జకాత్ నిధుల వివరాలు. మొత్తం ముస్లిముల జకాత్ నిధులు, ఇతర సదఖాల నిధులు కూడా కలుపుకుంటే ఈ మొత్తం ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు. సేకరించిన డాటా ప్రకారం తెలిసిన మరో విషయమేమంటే, జకాత్ నిధుల్లో 23 నుంచి 57 శాతం వరకు మానవీయ సహకారం కోసం వాడుతున్నారు. ఇప్పుడు జకాత్ వ్యవస్థ, జకాత్ ద్వారా పంపిణీ అయ్యే నిధుల గురించి మొత్తం ప్రపంచం మాట్లాడుతోంది. 2012లో జరిగిన ఒక సర్వే ప్రకారం 200 బిలియన్ డాలర్లు అంటే 1336410 కోట్ల రూపాయల నుంచి 1 ట్రిలియన్ డాలర్లు అంటే 66,82,050 కోట్ల రూపాయల వరకు ఏటా జకాత్ పంపిణీ అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా 2011లో పంపిణీ అయిన మానవీయ సహాయం 13 బిలియన్ డాలర్లు అంటే, 86,866 కోట్ల రూపాయలు మాత్రమే. జకాత్ రూపంలో పంపిణీ అయ్యే సహాయం దీనికన్నా దాదాపు 15 రెట్లు ఎక్కువ. అసలు మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా దేశాల మొత్తం స్థూల జాతీయోత్పత్తిలో రెండున్నర శాతం అంటే కనీసం 65 బిలియన్ అమెరికన్ డాలర్లు, అంటే 4,34,333 కోట్ల రూపాయలు ఉంటుంది. ఇది జకాత్ ఈ దేశాల్లో ఎంత ఉండవచ్చన్న బండ లెక్క. ప్రపంచవ్యాప్తంగా ముస్లిముల జకాత్ లెక్కలు తీస్తే ఎంత ఎక్కువగా ఉంటుందో అంచనా వేయవచ్చు. 2004లో ఆర్థికవేత్త హబీబ్ అహ్మద్ జకాత్ నిధులను లెక్కించి ముస్లిం దేశాలు జకాత్ నిధులను సక్రమంగా వినియోగిస్తే పేదరికం అన్నదే ఉండదని వివరించాడు.

ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటుంది. ప్రపంచంలో అనేక దేశాల్లో ప్రజలు అనేకమంది క్లిష్టపరిస్థితుల్లో దయనీయంగా




బతుకుతున్నారు. సహాయ సహకారాల కోసం ఎదురు చూస్తు న్నారు. ఇలా ఎదురు చూస్తున్న ప్రజల్లో ముస్లిములు కూడా ఉన్నారు. జకాత్ ఇచ్చేవారంతా ముస్లిములే. అందువల్లనే ప్రపంచ వ్యాప్తంగా మానవీయ సహకారానికి జకాత్, సదకా నిధులను కూడా ఉపయోగిస్తున్నారు. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో ఆపరేషన్ దేశాలు 2013లో అంతర్జాతీయ మానవీయ సహకారా నికి అందించిన మొత్తం 2.2 బిలియన్ డాలర్లు అంటే 14700 కోట్ల రూపాయలు.

ముస్లిం దేశాల్లో జకాత్ వసూలు ప్రభుత్వ పరంగా జరుగుతుంది. కొన్ని ముస్లిం దేశాల్లో స్వతంత్ర సంస్థలు ఈ పని చేస్తున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణ మాత్రమే ఉంటుంది. ముస్లిమేతర దేశాల్లో స్వచ్ఛంద సంస్థలు జకాత్ వసూలు చేయడం లేదా ముస్లిములు వ్యక్తిగతంగానే జకాత్ అవసరమైన వారికి ఇవ్వడం జరుగుతుంది. స్వచ్ఛంద సంస్థలు జకాత్ వసూలు చేసి సేవా కార్యక్రమాలకు, విద్య వైద్యం తదితర కార్యక్రమాలకు వినియోగించడం కూడా జరుగుతోంది. జకాత్ ఫౌండేషన్ భారతదేశంలో సివిల్ సర్వీసు కోచింగ్ వంటి సేవలు కూడా అందిస్తోంది. సమాజంలో సంపద పంపిణీకి జకాత్, సదఖాలు గొప్ప సాధనాలు. పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం సాధించడానికి ఇవి ఎంతైనా తోడ్పడతాయి. దాంతో పాటు ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో కష్టాలపాలైన నిర్భాగ్యులను ఆదుకోవడానికి అవసరమైన హ్యూమానిటేరియన్ నిధులు కూడా జకాత్ వల్ల లభిస్తాయి. ఉదాహరణకు సిరియాలో అంతర్యుద్ధంలో దాదాపు రెండున్నర లక్షల మంది మరణించారు. టర్కీ తదితర దేశాలు అక్కడ భారీస్థాయిలో మానవీయ సహకారం అందిస్తున్నాయి. ఈ సహకారానికి కావలసిన నిధులు జకాత్, సదకాల నుంచే లభిస్తున్నాయి. అలాగే రోహింగ్యాలపై మయన్మార్ అమానుష దౌర్జన్యాలలో అనేకమంది నిర్వాసితులయ్యారు. వారికి కావలసిన సహాయ సహకారాలకు జకాత్ నిధులు ఎంతో తోడ్పడు తున్నాయి. ఇంకా అనేక దేశాల్లో ప్రకృతి విపత్తులు, ఎబోలా వంటి వ్యాధులు ఇలా ఎన్నెన్నో కడగండ్లు. అంతర్జాతీయ మానవ సహకారానికి నిధులు సరిపోని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో జకాత్, సదఖా వంటి నిధులు అనేక దేశాల్లో నిర్భాగ్య ప్రజానీకాన్ని ఆదుకుంటున్నాయి.

డంకన్ గ్రీన్ జకాత్ ప్రత్యేకతను కూడా వివరించాడు. అన్ని మతధర్మాలు దానాన్ని ప్రోత్సహిస్తాయి. కాని జకాత్ విభిన్నమైనది. ఇది తప్పనిసరిగా చెల్లించవలసిందే. స్వచ్ఛందంగా ఇష్టమైతే ఇవ్వడం లేకపోతే లేదని తప్పించుకోవడం కుదరదు. అలాగే ఫిత్రా కూడా తప్పనిసరిగా ఇవ్వవలసిందే. ఈ సందర్భంగా డంకన్ గ్రీన్ ఆర్థిక అసమానత్వంపై పుస్తకం రాసిన థామస్ పికెటిని ప్రస్తావిస్తూ, ఇస్లాములో జకాత్ రూపంలో మనకు సంపద పన్ను ఆల్రెడీ ఉందన్న విషయం ఆయనకెవరైనా చెప్పండయ్యా అన్నాడు. అంతేకాదు, ప్రపంచంలో ప్రతి నలుగురిలో ఒకరు తప్పనిసరిగా దీనిని చెల్లిస్తున్నారు. ప్రపంచ జనాభాలో ముప్ఫయి శాతం ముస్లిములున్నారు.

అంతర్జాతీయంగా మానవసహకారాన్ని అందించే సంస్థలు ఇప్పుడు నిధుల కోసం జకాత్, సదకాల వైపు కూడా చూస్తున్నాయి. డంకన్ గ్రీన్ మరో మంచి మాట కూడా చెప్పాడు. పాశ్చాత్యులు డిజైన్ చేసిన మానవీయ సహకారం కోసం జకాత్ నిధులను సేకరించ డానికి ప్రయత్నాలు చేయడంతో పాటు, అసలు ఇస్లాములో మానవీయ సహకారానికి చూపించే దిశానిర్దేశనం ఏమిటో కూడా నేర్చుకోవాలని అన్నాడు. ఇంతకు ముందు చెప్పినట్లు థామస్ పికెటీ చాలా గొప్ప ఆర్థికవేత్త అయినప్పటికీ, సంపద పంపిణీలో అసమానత్వం గురించి ఆయన ఆందోళన, ఆవేదన చెందినప్పటికీ, ఆయనకు ఇస్లాం ప్రతిపాదించిన సంపద పంపిణీ గురించి తెలియదు. అందుకే డంకన్ గ్రీన్ ఆయనకు ఈ విషయం ఎవరైనా చెబితే బాగుండును అన్నాడు. అలాగే మానవీయ సహకారం ఎలా ఉండాలన్న విషయంలోను ఇస్లామ్ దారి చూపిస్తుంది.

**"మీరు దెప్పిపొడిచి, గ్రహీత మనస్సును గాయపరచి మీ దాన ధర్మాలను మట్టిలో కలపకండి." (అల్ బఖరా : 263)**

దానం చేయడం అంటే ఎదుటి వాడికి ఉపకారం చేయడం కాదు, అది పుచ్చుకునేవాడి హక్కు, ఇచ్చేవాడి బాధ్యత అన్న భావన ఇస్లామ్‌లో ముఖ్యమైనది. వివక్ష, పక్షపాతం లేకుండా అధ్యయనం చేస్తే ఇస్లాము నుంచి ప్రపంచం చాలా నేర్చుకోవచ్చు.

ఆహారాన్ని పంచుకు తినే అద్భుతమైన అందమైన దృశ్యాలు రమజాన్ మాసంలో కనువిందు చేస్తాయి. మనిషి తన కడుపు నిండా తినరాదని కనీసం మూడింట ఒక వంతు కడుపు ఖాళీగా ఉండాలని ప్రవక్త బోధించిన మాటలు గాని, రమజానులో ఉపవాసాలు కాని కేవలం ఆరోగ్య నియమాలు కావు, కేవలం సమానత్వానికి నిదర్శనాలు మాత్రమే కావు, సానుభూతిని పెంచే సాధనాలు మాత్రమే కావు. దేవుడు చూస్తున్నాడన్న బాధ్యతా భావంతో చేసే పనులివి. దేవుడు చూస్తున్నాడన్న బాధ్యతా భావం సంవత్సరమంతా, అందరిలో అన్ని పనుల్లో ఉంటే ఆ సమాజం ఎంత అద్భుతంగా ఉంటుంది! ఇస్లామ్ కోరే సమాజం అలాంటిది. అలాంటి సమాజం ఉనికిలోకి రావాలంటే అవసరమైన శిక్షణ ఇచ్చే మాసమే రమజాను మాసం.




## దేశంలో 45 శాతం మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు.. టాప్ ప్లేస్‌లో ఏపీ

ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్ ఆధారంగా 28 రాష్ట్రాలు/యూటీ అసెంబ్లీలకు చెందిన మొత్తం 4,123 మంది ఎమ్మెల్యేల్లో 4,092 మంది క్రిమినల్ రిపోర్ట్‌ను అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ వెలికితీసింది. ఈ రిపోర్ట్ ప్రకారం.. మొత్తం ఎమ్మెల్యేల్లో దాదాపు 45 శాతం అంటే 1,861 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వారిలో 1,205 మంది (25 శాతం) హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొం టున్నారు. ఏపీకి చెందిన ఎమ్మెల్యేలు అత్యధిక శాతం (174 మందిలో 138 మంది) క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నట్లు తేలింది. ఆ తర్వాత కేరళ, తెలంగాణలలో 69 శాతం, బీహార్ రాష్ట్రం 66 శాతం, మహారాష్ట్రలో 65 శాతం, తమిళనాడులో 59 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల జాబితాలో ఏపీ 59 శాతంతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత 50 శాతంతో తెలంగాణ, 49 శాతంతో బీహార్ ఉన్నాయి.

## అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ.. జాబితాలో దక్షిణాది నగరాలు..!



దేశ రాజధాని ఢిల్లీ నగరం మరోసారి మోస్ట్ పొల్యూటెడ్ సిటీగా నిలిచింది. 2024-25 శీతాకాలంలో (అక్టోబర్ నుంచి జనవరి 31 వరకు) ఢిల్లీలో సగటు పీఎం 2.5 స్థాయి క్యూబిక్ మీటర్‌కు 715 మైక్రోగ్రాములుగా రికార్డయ్యింది. ఇది ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే చాలా ఎక్కువ. సంతోషకర విషయమేమంటే, ఢిల్లీలో గాలి నాణ్యత గతేడాదితో పోలిస్తే కాస్త మెరుగ్గా ఉన్నది. గతేడాది ఇదే సమయంలో 2023-24 శీతాకాలంలో పీఎం2.5 స్థాయి క్యూబిక్ మీటర్‌కు 189 మైక్రోగ్రాములుగా రికార్డయ్యింది. ఢిల్లీ తర్వాత పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా నగరం దేశంలో రెండో అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. 2024-25 శీతాకాలంలో పీఎం 2.5 సగటు స్థాయి క్యూబిక్ మీటర్‌కు 65 మైక్రోగ్రాములుగా నమోదైంది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (CSE) నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ముంబయి, బెంగళూరు, కోల్‌కతాలో కాలుష్యం గత సంవత్సరంతో పోలిస్తే తగ్గిందని.. చెన్నై, హైదరా బాద్‌లో అలాగే ఉన్నట్లు నివేదిక పేర్కొంది. హైదరాబాద్‌లో పీఎం 2.5 సగటున క్యూబిక్ మీటర్‌కు 52 మైక్రోగ్రాములు, ముంబయిలో 50, బెంగళూరులో 37, చెన్నైలో 36 మైక్రోగ్రాములు ఉన్నట్లుగా నివేదిక తెలిపింది.

## త్వరలో భారత్‌కు రానున్న సునీత విలియమ్స్.. బంధువుల వెల్లడి



భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS) నుంచి భూమిపైకి తిరిగొచ్చారు. దాదాపు 9 నెలలపాటు అంతరిక్షంలో చిక్కుకుపోయిన ఆమె బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో సముద్ర జలాల్లో దిగారు. వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరడంతో ప్రపంచం మొత్తం హాయిగా ఊపిరి పీల్చుకుంది. సుదీర్ఘ విరామం తర్వాత పుడమికి చేరిన వారికి యావత్తు ప్రపంచం స్వాగతం చెప్పింది. ఇక సునీత సురక్షితంగా భూమికి చేరడంతో భారత్‌లోని ఆమె పూర్వీకుల గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. గుజరాత్ రాష్ట్రంలోని ఝులాసన్‌లో ఆమె బంధువులు, స్థానికులు బాణసంచా కాల్చి నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. 286 రోజుల తర్వాత సునీత సేఫ్‌గా భూమిపైకి రావడంపై ఆమె సోదరి ఫాల్గుణి పాండ్యా సంతోషం వ్యక్తం చేశారు. సునీత కోసం తొమ్మిది నెలలుగా ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అమెరికా ప్రభుత్వానికి, నాసాకు కృతజ్ఞతలు తెలిపారు. సునీత త్వరలోనే భారత్ (India)కు రానున్నట్లు ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.




## పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ లైంగిక హింస: ఐక్యరాజ్య సమితి

హమాస్‌తో యుద్ధం వేళ ఇజ్రాయెల్‌పై ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆరోపణలు చేసింది. గాజా స్ట్రిప్‌లో యుద్ధం సందర్భంగా పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ లైంగిక హింసకు పాల్పడిందని ఐరాసకు చెందిన మానవ హక్కుల నిపుణులు గురువారం ఆరోపించారు. 'గాజా ప్రాంతంలో హమాస్‌తో జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్ లైంగిక, పునరుత్పత్తి, ఇతర లింగ ఆధారిత హింసకు క్రమబద్ధంగా పాల్పడింది' అని వారు తెలిపారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్‌లు దాడి చేసిన అనంతరం ఇంత తీవ్ర స్థాయి ఆరోపణలు ఎన్నడూ రాలేదు. అయితే ఇజ్రాయెల్ వ్యతిరేక చర్యల్లో భాగంగానే ఐరాస మానవ హక్కుల కౌన్సిల్ ఇలాంటి ఆరోపణలు చేసిందని ఆ దేశ ప్రధాని నెతన్యాహూ అన్నారు. అయితే వారు దీనిపై తాము కనుగొన్నదేమిటో వివరించ లేదని ఆయన విమర్శించారు. గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడి అనంతరం ఐరాస మానవ హక్కుల కమిషన్ యుద్ధం జరిగిన ప్రాంతాల్లో పర్యటించి, దానిపై నివేదిక సమర్పించింది.

## హార్ట్ ఎటాక్‌కు వ్యాక్సిన్!

యావత్ ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద అనారోగ్య సమస్య హార్ట్ ఎటాక్ రాకుండా ముందస్తుగానే అడ్డుకునే వ్యాక్సిన్ అభివృద్ధిలో చైనా పరిశోధకులు పురోగతి సాధించారు. ఇది రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా నివారిస్తుంది. నాన్‌జింగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు అభివృద్ధి చేసిన వ్యాక్సిన్‌ను ఎలుకలపై ప్రయోగించగా అథెరోస్లెరోసిస్ నివారణలో మెరుగైన ఫలితాలు కనిపించాయి.

## గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్.. 400 మందికి పైగా మృతి

గాజా స్ట్రిప్‌పై మంగళవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా దాదాపు 404 మంది ప్రాణాలు కోల్పోయారని, 500 మందికిపైగా గాయపడ్డారని గాజా వైద్య శాఖ అధికారులు వెల్లడించారు. జనవరి నుంచి కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్న తరుణంలో ఇజ్రాయెల్ అనూహ్యంగా ఈ దాడులకు దిగింది. దీంతో ఏడాదిన్నరగా సాగిన యుద్ధం మళ్లీ ప్రజ్వరిల్లే సూచనలు కనిపిస్తున్నాయి. కాల్పుల విరమణకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఇటలీ, ఖతర్ సహా పలు దేశాలు ఇజ్రాయెల్ దాడులను ఖండించాయి.

## కెనడా మంత్రులుగా ఇద్దరు భారత సంతతి ఎంపీలు

కెనడా నూతన ప్రధాన మంత్రి మార్క్ కార్నీ మంత్రివర్గంలో ఇద్దరు భారత సంతతి ఎంపీలకు స్థానం లభించింది. ఇండో-కెనడియన్ అనిత ఆనంద్, ఢిల్లీలో జన్మించిన కమల్ ఖేరాలకు మంత్రి పదవులు లభించాయి. కార్నీ, ఆయన మంత్రివర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనితకు ఇన్నోవేషన్, సైన్స్, పరిశ్రమల శాఖ, కమల్ ఖేరాకు ఆరోగ్య శాఖ ఇచ్చారు. మంత్రి పదవులను నిలబెట్టుకున్న కొద్ది మందిలో వీరిద్దరూ ఉన్నారు. కమల్ బాల్యంలోనే ఆమె తల్లిదండ్రులు కెనడాకు వలస వెళ్లారు. పార్లమెంటుకు ఎన్నికైన అత్యంత పిన్న వయస్కులైన మహిళలలో ఆమె ఒకరు. లిబరల్ పార్టీలో ప్రధాని పదవికి పోటీలో ముందున్న అనిత జనవరిలో తాను పోటీలో లేనని ప్రకటించారు.

## రోహింగ్యా శరణార్థుల శిబిరానికి యూఎన్ చీఫ్


బంగ్లాదేశ్‌లోని రోహింగ్యా శరణార్థుల శిబిరాన్ని యూఎన్ చీఫ్ ఆంటానియో గుటెరస్ ఇటీవల సందర్శించారు. వచ్చే నెల నుంచి వారికి అందించే ఆహార సాయంలో తీవ్రమైన కోత విధించనున్న నేపథ్యంలో గుటెరస్ పర్యటన ప్రాధాన్యత సంతరించు కుంది. ప్రపంచంలోనే అతిపెద్ద శరణార్థి స్థావరంలో జీవన పరిస్థితులు ఇప్పటికే దుర్భరంగా మారిన నేపథ్యంలో తాజా పరిణామాలు మరింత కలవరపెడుతున్నాయి. యుఎస్ ఎయిడ్ కార్యకలాపాలు మూతపడిన పరిస్థితుల్లో అత్యవసర ఆహార సరఫరాల్లో కోతలు వుంటాయని ప్రపంచ ఆహార కార్యక్రమం ఇప్పటికే ప్రకటించింది. ఏప్రిల్ నుంచి రోహింగ్యాలకు ఇచ్చే ఆహార వోచర్లను రూ.12.50 నుంచి రూ.6కు తగ్గించాల్సి వస్తోంది. నిధుల కొరత కారణంగా తీసుకునే ఈ చర్యలతో శరణార్థులతో కిక్కిరిసిపోయిన శిబిరాల్లో ఆకలి కేకలు మరింత ఎక్కువవుతాయని ఆందోళనలు మొదలయ్యాయి. రోహింగ్యా శరణార్థులకు ప్రధానంగా ఆర్థిక సాయం అందించే దేశంగా ఇప్పటివరకు అమెరికా వుంది. ట్రంప్ వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఈ శిబిరాల్లోని పిల్లలు 2017 నుండి తీవ్ర పోషకాహార లోపాలతో బాధపడుతున్నారని యునిసెఫ్ పేర్కొంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 27శాతం ఇటువంటి కేసులు పెరిగాయి. "ఇప్పటికే మాకు ఏదైతే ఇస్తున్నారో అది చాలడం లేదు. ఇంకా దాన్ని సగానికి తగ్గిస్తే ఇక మేం కరువు వాతన పడాల్సిందే" అని మయన్మార్‌కు చెందిన 31 ఏండ్ల శరణార్థి మహ్మద్ సాబిర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ తమను పనిచేయడానికి అనుమతించరని, అటువంటపుడు నా పిల్లలను ఎలా పోషించాలో తెలియడం లేదన్నారు. బంగ్లాదేశ్‌లో 10లక్షల మందికి పైగా రోహింగ్యా శరణార్థులు వున్నారు.

# సాత్వికతకు సోపానం

**అన్వర్ బేగ్**

**క్రమశిక్షణ** మనల్ని సమర్థులుగా, పరిపూర్ణులుగా తీర్చిదిద్దుతుంది. రమజాన్ మాసంలో విశ్వాసులు పాటించే క్రమశిక్షణ, ఉపవాసాలు ఇందుకు చక్కని ఉదాహరణ. వాస్తవానికి ఇస్లాంను విశ్వసించే వ్యక్తి ఎల్లప్పుడూ సామరస్య భావనతో జీవిస్తాడు. దేన్ని ఎలా చేయాలో తెలుసుకొని అలా చేస్తాడు. పవిత్ర రమజాన్ మాసంలోని ప్రతి క్షణాన్ని దైవారాధనలో, వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడంలో వినియోగిస్తాడు. మంచి పనులు చేయడాన్ని అలవాటుగా మార్చుకుంటాడు. మనుషులతో ఉత్తమంగా మెలుగుతూ, సంస్థలను చక్కగా నిర్వహిస్తూ ఎక్కువ ఫలితాలను సాధిస్తాడు. ఆత్మను, హృదయాన్ని ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నం చేసి వాటిని తన అదుపులో ఉంచుకుంటాడు. అల్లాహ్‌కు విధేయుడిగా ఉండే విశ్వాసి రమజాన్ ఉపవాసాలు, క్రమశిక్షణ వల్ల దైవం ఆశీస్సులు పొందడమే కాకుండా తానుండే సమాజానికి ఆత్మీయుడు అవుతాడు. ప్రాపంచిక విషయాల నుంచి పూర్తిగా పక్కకు జరిగి దైవ సాక్షాత్కారం పొందుతాడు. ఆనాటి నుంచి తనను తాను మరచి అల్లాహ్ గురించే ఆలోచిస్తాడు. నిత్యం ఖుర్‌ఆన్ పఠనం చేయడం వల్ల పునీతుడవుతాడు. మనిషి జీవిత కాలాన్ని రమజాన్ మాసంగా భావిస్తే ఉపవాసాల ప్రారంభాన్ని యవ్వనంగా, ఉపవాస విరమణను మరణంగా అభివర్ణించవచ్చు.

రమజాన్ మాసంలో మనం పాటించే క్రమశిక్షణ ఏడాది పొడవునా సత్ఫలితాలను ఇస్తుంది. రోజువారీ పనుల్లో తోటివారికి సాయం చేయడం, పేదలకు దానం చేయడం, శ్రద్ధగా నమాజ్ చేయడం, కుటుంబంతో కలసి ఆహారం తీసుకోవడం మనకు అలవడతాయి. రోజాలు పాటించడం వల్ల ఇరుగు పొరుగువారి గురించి ఆలోచిస్తాం. సత్ప్రవర్తన కలిగి ఉంటాం. పగలంతా ఉపవాసం ఉండటం వల్ల ఆకలిబాధ, ఆహారం విలువ అవగతమవుతాయి. శ్రద్ధగా దైవారాధన చేయడం వల్ల ఆధ్యాత్మిక, మానసిక, శారీరక క్రమశిక్షణ అలవడుతుంది. పరలోక సాఫల్యాన్ని పొందేందుకు శిక్షణ లభిస్తుంది. ఆత్మ ప్రక్షాళన జరిగి సహనం అలవడుతుంది. ఎదుటి వారి పట్ల దయగా, మర్యాదగా ప్రవర్తించడం అలవడుతుంది. ఉపవాసాల వల్ల మనం చేసే త్యాగాలతో ఆధ్యాత్మిక తృప్తి లభిస్తుంది. సమయపాలన, స్వీయ ఆరోగ్య సంరక్షణ అలవాట్లుగా మారతాయి. వ్యక్తిత్వ వికాసం జరగడం వల్ల సామాజిక సంబంధాలు మెరుగు పడతాయి. ఉపవాసాల వల్ల మన శరీరంలోని విషాలు, వ్యర్థాలు బయటకు వెళ్లి పోయి పొట్ట శుభ్రం అవుతుంది. అన్నపానీయాల్లో తగిన పోషకాలు ఉండేలా చూసుకోవడం, పరిమితంగా ఆహారం తీసుకోవడం, మన పొట్టను మన నియంత్రణలో ఉంచుకోవడం సాధ్యమవుతుంది. ఇలా రమజాన్ ఉపవాసాలు మన సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేస్తాయి. మనల్ని మానసికంగా, ఆధ్యాత్మికంగా సంస్కరించి దైవానికి దగ్గర చేస్తాయి. మనల్ని నిజమైన విశ్వాసులుగా తీర్చిదిద్దుతాయి.




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**